నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## నమ్మలేని నిజాలు

మట్టి పాత్రలు
రుచికర భోజనం
ఆరోగ్య హితం.

మరణం సత్యం
భువి సత్యం సజీవం
గరిమానాభి.

ఆత్మహత్యలు
నైరాశ్యంలో యువత
ఉపాధి హామి.

నిండు కుండలు
జంట జలశయాలు
జల సమృద్ధి.

శాస్త్రీయ భయం
తిరోగమనదారి
బ్యాలెట్ పేపరు



– రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

## శ్రీనిజాలు

హెచ్చరికలు లేకుండా
ముంచెత్తిన వరదా!
బస్తీ వాసుల దుస్థితి
మూసీ నది బురదా!

సర్వస్వం కోల్పోయిన
గరీబోళ్ల బతకులు!
రెక్కలు ముక్కలు చేసిన
కరువాయే మెతుకులు!



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ బుధవారం 1-10-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:41 పేజీలు:6 వెల: రూ.1/-



















# బహుముఖీన కృషీవలుడు దాస్యం సేనాధిపతి



– బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
తొలి ఛైర్మన్, బీసీ కమిషన్,
తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

## సాహితీ కెరటాలు

సాహితీవేత్తగా సుపరిచితులైన మిత్రుడు దాస్యం సేనాధిపతి అటు విద్యాశాఖలో, ఇటు సాహిత్య సామాజిక సేవా రంగాల్లో దశాబ్దాలుగా కృషి చేస్తున్నారు. స్వీయ కృషితో తనదైన చరిత్రను సృష్టించుకున్న బహుముఖీన సారస్వత జ్యోతి 1950 అక్టోబర్ 5న నిర్మల్‌లో పుట్టి కరీంనగర్‌లో స్థిరపడ్డ దాస్యం సేనాధిపతి కృషి బహుముఖీనం. ఎం.కాం.బి.ఈడి చేసిన వీరు సాహిత్యరంగంలో పలు రికార్డులు నెలకొల్పడం విశేషం.

యాభైకి పైగా కథలు, వెయ్యికి పైగా సంపాదక లేఖలు, రెండు వేల పుస్తక సమీక్షలు, వివిధ ప్రక్రియల్లో 16 గ్రంథాలు, వందలాది కవితలు, వీరి సాహిత్య కృషికి నిదర్శనాలు. **చిటికెలు, అక్షరం సాక్షిగా, శబ్దలయ, ఇప్పుడిప్పుడే వంటి కవితా సంపుటాలు, సంవీక్ష వీక్షణ, దర్శనం, ప్రతిభాస్వరాలు, అవలోకనం, మధురాక్షరి, వివేచనం** వంటి సాహిత్య సమీక్ష గ్రంథాలు వెలువరించారు. కథా సాహిత్యానికి **'పరిష్కారం'** అనే కథల సంపుటి చేర్పును అందించారు.

వచన కవిత్వం ఎలా అభ్యసించాలో 24 పాఠాలతో **'దిక్సూచి'** అనే పాఠ్య గ్రంథం రాసి యువతరానికి దారి చూపారు. ఆంధ్రభూమి దిన పత్రికలో 75 వారాలు జిల్లా సాహిత్య పేజిని రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చారు. ఆ సందర్భంగా నాతో పాటు 33 మంది సాహితీవేత్తలను ఇంటర్వ్యూ చేయడంతో పాటు వాటిని పుస్తకంగా వెలువరించారు. ఇంటర్వ్యూలతో ఆయా సాహితీవేత్తల హృదయాలను ఆవిష్కరించి యువతరానికి స్ఫూర్తినం దించారు.

దిన.వార పత్రికలకు, **'సంపాదకుల లేఖ'** రాయడం అనేది ఒక చక్కని ప్రక్రియ. ఈ లేఖా ప్రక్రియలో వెయ్యికి పైగా లేఖలు రాసి చరిత్ర సృష్టించారు. వాటిలో ముఖ్యమైన వాటిని ఎంపిక చేసి **'సుహృల్లేఖ'** పేరి పుస్తకం వెలువరిం చారు. తద్వారా వాటి చారిత్రక ప్రాధా న్యతను గుర్తు చేశారు. వాటికి సామా జిక సాహిత్య గౌరవం కలిగించారు.

సంపాదక లేఖలను 'సుహృల్లేఖ' పేరిట పుస్తకం వెలువరించి వాటికి చారిత్రక ప్రాధాన్యతతో పాటు సామాజిక సాహిత్య గౌరవం కలిగించారు. తద్వారా లేఖల ప్రాధాన్యత ఏమిటో యువతరానికి అర్థం చేయించారు.

ఉద్యోగ పరంగా శాతవాహన యునివర్సిటీ అడిషనల్ ఎగ్జామ్స్‌గా, కామర్స్ శాఖ అధ్యక్షులుగా కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కళాశాల విద్యా కమిషనరేట్ అకడమిక్ ఎడిటర్ గా , ఇగ్నో కోఆర్డినేటర్‌గా, ఎన్‌ఎస్ ఎస్ ప్రోగాం అధికారిగా విశిష్ట సేవలను అందించారు. శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆంధ్రప్రదేశ్ సంస్థలో రాష్ట్ర ప్రధాన పర్యవేక్షణ, అధికారిగా, ప్రభుత్వ విద్యారంగ సలహాదారుగా, ఆర్గనైజర్‌గా, భిన్నాభిప్రాయాలు గల వారితో కూడ కలిసి నడిచే కలుపుకుపోయే సౌజన్యశీలిగా దాస్యంసేనాధిపతిగారి వ్యక్తిత్వంలో ఎన్నో ప్రత్యేకతలు, విశిష్ఠతలు, వారి కృషి వల్ల ఎందరో యువతరం నుండి ఎదిగి వచ్చారు.

వీరు సహజంగా సౌమ్యులు, అందరిని కలుపుకొని పోవా లనుకొనే విశాల హృదయులు. వీరి సమీక్షలు, చేసిన ఇంటర్వ్యూలు, సభా నిర్వహణ తీరు ఈ విషయం స్పష్టం చేస్తాయి. దూరదర్శన్‌లో కూడా అనేక కార్యక్రమాలు నిర్వహించారు.

సాహిత్య కృషిలో రాసి వాసి కూడాపెద్దదే. నూరు గ్రంథాలకు పీఠికలు, 20 గ్రంథాలకు సంపాదకత్వం, వ్యక్తిత్వ వికాస రచనలు, నా వలెనే సాహిత్యాన్ని ప్రోత్సహించాలని పదేళ్ళుగా నాన్న పేరిట రాష్ట్రస్థాయిలో, సినారే వాగ్భూషణ పురస్కారం, ఎనిమిదేళ్లగా అందజేసున్నారు. లెక్కలేనన్ని సత్కారాలు పురస్కారాలు అందుకున్నారు.

వలు సాహితీ సంస్థలతో అనుబంధం కొనసాగిస్తూ, అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఉదయసాహితీ తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా , తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర కోశాధికారిగా, తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, సాహితీ గౌతమి అధ్యక్షులుగా, పలు సాహితీ సంస్థలకు సలహాదారుగా తన సేవలను అందించారు.

తెలుగు విశ్వ విద్యాలయం వారి కీర్తి పురస్కారం, అమృతలత గారి జీవన సాఫల్య పురస్కారం, తెలంగాణ సారస్వత పరిషత్‌వారి ధర్మనిధి పురస్కారం, విశ్వసాహితీవారి జీవన సాఫల్య పురస్కారం, కళాశ్రీ జీవన సాఫల్య పురస్కారం, బొద్దుల వెంకటేశం స్మారక పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారంతో పాటు విద్యారంగంలో 50కి పైగా పురస్కారాలు అందుకున్నారు. సన్మాన, సత్కారాలు లెక్కలేనన్ని స్వీకరించారు. ఉగాది పర్వదినం సందర్భంగా 2017లో ముంబాయి తెలుగువారు నిర్వహించిన ఉగాది వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరవడం గొప్ప అనుభూతిని ఇచ్చిందం టారు దాస్యం. పలు విద్యా సంబంధ, జాతీయసదస్సులకు హాజరై 10కి పైగా సెమినార్ పత్రాలను సమర్పించారు.దాస్యంసేనాధిపతి పుస్తక సమీక్షలు రాయడంలో చరిత్ర సృష్టించారు. సేనాధిపతి తరువాతే నేను అని ద్వానా శాస్త్రి గారు సైతం మెచ్చుకున్నారంటే మామూలు విషయం కాదు. సాహిత్యంతో సంబంధం లేని కామర్స్ బోధనా పాఠ్యాంశాలు చెప్తూ రెండువేల పుస్తకాలను సమీక్షించారంటే వీరి సాహిత్య జిజ్ఞాస, అధ్యయనా నుభవం ఎంత గొప్పదో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

దాస్యం సేనాధిపతి తెలుగు సాహిత్య సామాజిక సాంస్కృతిక రంగాలలో పని చేసుకుంటూ వెళ్లడమే జీవన గమనంగా గమ్యంగా మలుచుకున్న బాటసారి. ఎన్ని మైలు రాళ్లు దాటారో, ఎన్ని శిఖరాలు అధిరోహించారో.దాస్యం సేనాధిపతిగారు తనదైన కృషితో అనితర సాధ్యంగా ముందుకు సాగి తన చరిత్రను తాను నిర్మించుకున్నారు. జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో కర్తవ్యాలైతేమి, బాధ్యతలైతేనేమి, పదవులు ప్రమోషన్లు అన్నిటా విస్తరించినవారు దాస్యం సేనాదిపతి గారు. తన జీవితాన్ని గెలుచుకున్నారు. వేలాది విద్యార్థులకు జీవితం గెలుచుకోవడం ఎలాగో, వ్యక్తిత్వం ప్రాధాన్యత ఏమిటో తెలిపి తీర్చదిద్దారు.

(అక్టోబర్ 5 దాస్యం సేనాధిపతి జన్మదినం సందర్భంగా..)
















































# తూర్పు వాకిలి

**వెయ్యేండ్లు తిరిగి చూడని, పరుగు ఆపని చరిత్ర పద్యానిది. ఆధునిక భానూదయకాంతుల ప్రతిఫలనంతో, ఆంగ్లేయ సంపర్కంతో, పాశ్చాత్య సాహిత్య ప్రక్రియల ప్రభావంతో భారత దేశమంతటా వచన రచన సహస్రముఖాలుగా విస్తరిల్లింది.**

ఆధునికత అన్న తల్లివేరుతో కవిత, కథానిక, నవల, నాటకం, వ్యాసం- వంటి ప్రక్రియలు శాఖోపశాఖలతో తేజరిల్లసాగాయి.

అప్పుడైనా, ఇప్పుడైనా ప్రక్రియ ఏదైనా సృజనాత్మక రచనకు అగ్రతాంబూలం ఇవ్వవలసిందే. ఆ తర్వాత ఆ సృజనాత్మక రచన బాగోగులను బేరీజు వేసేది వచన సాహిత్య ప్రక్రియ అయిన వ్యాసమే. దీన్ని గంభీరంగా సాహిత్య విమర్శ (Literacy Criticisum) అని పిలి చారు. Criticisum ను Willian Henry Hudson అన్న విమర్శకుడు తడబాటు లేకుండా. "In its strict sence the world criticism means judgeent" అని అన్నాడు. మొదట్లో బహుశా ఆంగ్ల సాహిత్యంలో రచన మీద తుది తీర్పు చెప్పే పద్ధతిలోనే విమర్శకులు వ్యవహరించి నట్లున్నారు. తన భావ కవిత్వం (Romantic Poetry) మీద విమర్శకులు దాడి చేసినందువల్లనే సుకుమార హృదయుడైన జాన్ కీట్స్ మరణించా డనే వాదం ఉంది. తెలుగులో రాచ మల్లు రామచంద్రారెడ్డిగారు నిర్దాక్షిణ్యంగా విమర్శిస్తారనే అభిప్రా యం లేకపోలేదు. రాను రాను ఒక రచనను విశ్లేషించటం, మూల్యాం కనం చేయటం, తాత్త్వికంగా, ప్రక్రియాపరంగా అంచనావేయటం, సంస్కారపు హద్దులను దాటకుండా రచనలోని లోపాలను సూచించటం వంటి లక్షణాలు విమర్శకు అంతర్భా గాలు అయ్యాయి.

డాక్టర్ తూర్పు మల్లారెడ్డి గారి వ్యాస సంపుటి **'అన్వేషణ'**లోని 28 సాహిత్య వ్యాసాలలో ఈ లక్షణాలే మనకు కొట్టొచ్చినట్లు కన్పిస్తాయి. వీరు రాసిన వ్యాసాలలో ఒకటి రెండు చా లాకాలం కిందట రాసినవిగా కనబడు తున్నాయి. దీన్నిబట్టి తన రచనలు పత్రికల్లో రావటంతోనే తృప్తి చెంది నట్లున్నారు. పుస్తకంగా ప్రచురించే విషయంలో చాలా ఆలస్యం చేసినట్లు కనిపిస్తుంది.

జాషువా భారతీయ కులవ్యవస్థ మీద తిరుగుబాటు చేసిన మహాకవి, అసమాన వ్యవస్థలో తాముపడ్డ అవమానాల మూలంగా పెల్లుబికి వచ్చిన కవితాధార కన్నీటితో కలిసి బీడు భూములను తడిపింది. జాషువా గారిది కేవలం నిరసన కవిత్వమో, విమర్శనాత్మక కవిత్వమో కాదు. అది సమాజం మీద కదన శంఖం పూరించిన కవిత్వం. దారుణమైన కులవివక్షకు మూలకార ణాల మీద గురిచూసి వదిలిన శస్త్రా_స్త్రాలు వారి పద్యాలు. **'గబ్బిలం'**లోని ప్రధానమైన వస్తువ్యంగాన్ని మల్లారెడ్డి గారు సరిగ్గా గుర్తించారు. అందుకే, ఈ ఖండ కావ్యం **'నవ్యాంధ్ర సందేశ కావ్యాల లో తలమానికమై క్షుధార్తుల బాధకు ప్రతిరూపమై, మానవతకు, జాతి ముక్తికి, దేశభక్తికి కేతనమై కరుణ రసానికి ప్రతీకయై ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో మానవతావా దానికి జయపతాకమై నిలుస్తుంది'** అని వ్యాఖ్యానించగలిగారు.

గురజాడ **'కన్యాశుల్కం'** తెలుగు జాతి మనోరంగ స్థలం మీద ఇప్పటికీ అనునిత్యం ప్రదర్శితమయ్యే మహా సాంఘీక నాటకం. శతాధిక సంవత్స రాలు గడిచినా దాన్ని మించిన నాట కం ఇంకా రాకపోవటం ఆ నాటక ఔన్నత్యానికి నిదర్శనం. ఈ నాటకం ఊహాలోకం నుండి ఊడిపడ్డది కాదని, ఆనాటి కాలమాన పరిస్థితుల ప్రభా వంతో సృష్టించబడిందని తూర్పు మల్లారెడ్డిగారు శ్రీశ్రీ కొటేషన్ ద్వారా తెలియజేస్తున్నారు. **'తెలుగు వాడుక భాష నాటకాలకు తగింది కాదని ప్రజల్లో ఉన్న దురభిప్రా యాన్ని తొలగించేందుకు'** కూడా తాము ఆ నాటకాన్ని రాసినట్లుగా గుజాడ చెప్పుకున్న అంశాన్ని కూడా మల్లారెడ్డి గారు మరచిపోకుండా చెప్పి, సాంఘిక సాహిత్య ప్రయోజనాలతో పాటు భాషా ప్రయోజనం కూడా ఆ మహా నాటకంలో ఇమిడి ఉన్న సత్యాన్ని గుర్తించారు.

ఈ శతాబ్దపు మహోన్నత వ్యక్తులలో మదర్ థెరిసా ఒకరు. క్రీస్తు చింతన నుంచి జన్మించిన నిశ్శబ్దసేవ కు మారుపేరు మదర్ థెరిసా, కుల, మత, వర్ణ, వర్గ, వయో, ప్రాంతీయ భేదాల కతీతంగా ప్రపంచ మానవ సేవలో జీవితాన్ని పండించు కున్న మాతృమూర్తి మదర్ థెరిసా జీవితాన్ని సంగ్రహంగా విశదీకరించి చూపారు.

**'ఎనభై వత్సరాల ఎర్రమందారం'** అని జైని మల్లయ్య గుప్తాగారిని మల్లారెడ్డిగారు అభివర్ణించ డం ఎంతో సముచితంగా ఉంది. 1946-52 సంవత్సరాల మధ్య ఉధృతంగా సాగిన తెలంగాణ రైతాంగ పోరాటంలో పాల్గొన్న తరానికి చివరి ప్రతినిధి వర్గం వారైన జైని మల్లయ్య గుప్త వామపక్షవాదిగా ప్రజాపోరా టాలలో నిర్భయంగా పాల్గొని యువతకు స్ఫూర్తిప్రధాతగా నిలిచారు. పోలీస్ యాక్షన్ వరకు జరిగిన అన్ని చారిత్రాత్మక ఘట్టాలలో పాల్గొన్న సాహసిగా గుప్తాగారి వ్యక్తిత్వాన్ని తూర్పు మల్లారెడ్డిగారు చిత్రించిన తీరు సహజంగా ఉంది.

2007లో మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో తాను పనిచేస్తున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళాశాల, భువనగిరిలో **"తెలంగాణ సాహిత్యం - జీవిత చిత్రణం'** అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించాడు మల్లారెడ్డి. ఆ సదస్సు పత్రాలను పుస్తక రూపంలో ముద్రించాడు. దానికి **'తెలంగాణ సాహిత్యం దేవులాట'** పేరుతో సవివరమైన ఉపోద్ఘాత వ్యాసాన్ని రాశాడు. తన ఈ ప్రయత్నం ద్వారా మలిదశ తెలంగాణోద్యమ సమయంలో మరుగునపడ్డ తెలంగాణ సాహిత్యాన్ని వెతికి వెలికితీసే పనికి తనవంతు ప్రోత్సాహాన్ని అందించాడు.

బహుముఖ ప్రజ్ఞాశీలియైన సుర వరం ప్రతాపరెడ్డిగారి సాహిత్య ప్రస్థానంలోని లఘు రచనలను వివ రించిన తీరు శ్లాఘనీయంగా ఉంది.

దాదాపు 1960 వరకు తెలం గాణలోని కవుల తొలిరచనల్నీ పద్య ప్రక్రియలోనే జరిగేవి. దశాబ్దాలుగా పద్యాన్ని బతికిస్తూ వచ్చింది శతక వాఙ్మయమే. ప్రసిద్ధ కవుల బాల్య మంతా కష్టాలమయమే. తల్లినో, తండ్రినో పోగొట్టుకొని అనాథలవలె బతుకీడుస్తూ వచ్చేవారు. కష్టాలు పెట్టే రాపిడిలోనే వారి మేధ పదునేక్కేది. తెలంగాణ ప్రభుత్వ దాశరథి పురస్కార గ్రహీతలైన మధురకవి కూరెళ్ళ విఠలాచార్యగారి జీవితం కూడా అట్లాంటిదే నంటున్నారు తూర్పు మల్లారెడ్డిగారు. తమ **'పల్లెఒడిలో సాహితీ కుటీరం'** అన్న వ్యాసంలో. పండిత శిక్షణ కళాశాలలో ఉత్పల సత్యనారాయణాచార్య చేసిన కావ్య గానం **'ఎలకోయిల'** కవితాగానం లాగా వీరిని ఆకట్టుకున్నదట. అదే శైలిలో తామూ కావ్యాలు రాసి ఆలపించసాగారు. అయితే తూర్పు మల్లారెడ్డిగారి దృష్టిలో విఠలాచార్య గారికి 'విఠలేశ్వర శతకం పర్యాయ పదమై నిలిచింది'. తమ ఇంట్లోనే బ్రహ్మాండమైన గ్రంథాలయాన్ని స్థాపించి, గ్రామీణ, నగర ప్రాంతాల పాఠకులకు, పరిశోధకులకు బాసటగా నిలిచారు. ఆదర్శజీవితం గడుపుతున్న మహోన్నత వ్యక్తి విఠలాచార్యగారు.

స్థానీయత (Local attachment) అంటే మనిషి తాను పుట్టి పెరిగిన ప్రాంతంలోని మట్టి వాసన. మాట తీరు, బ్రతుకుబాట తీరు అని పేర్కొం టూ గోపీ కవిత్వంలోని స్థానీయతా అంశాన్ని సంగ్రహంగా ప్రకాశింప జేశారు.

తెలంగాణ మలి ఉద్యమకాలం లో మనవాళ్ళ గతంలో అనేక రం గాలలో చేసిన కృషిని తెలుసుకోవటం అవసరంగా తోచింది. **'మేము రాకపూర్వం తెలంగాణ చీకటియుగం లో ఉండేది'** వంటి వ్యాఖ్యానాలు చేస్తున్నవారికి సరైన జవాబు చెప్పవలసిన అవసరం ఏర్పడింది. ఇందులో భాగంగానే మన ప్రాంతలో నడుస్తున్న చరిత్రను నమోదుచేసే పత్రికల ప్రచురణ, వ్యాప్తి ఎట్లా ఉండేదన్న ఆసక్తి సహజంగా కలుగు తుంది. ఈ విషయంలో తూర్పు మల్లారెడ్డిగారు గతకాలపు దారులలో పయనించి 'దక్కన్ టైమ్స్ (1864), 'శేద్యచంద్రిక' (1886) 'హితబోధిని (1912), **'గోలకొండ పత్రిక'** (1926) వంటి పత్రికలు వివిధ రంగాలపై ప్రసరింపజేసి జ్ఞానకాంతు లను గురించి సాకల్యంగా తెలియ జేశారు.

ఇది ప్రధానంగా పరిశోధనా త్మక వ్యాసం.

**'ఆధునిక తెలంగాణ కథా పరి ణామం'** (1900-1970) తూర్పు మల్లారెడ్డిగారు రాసిన విలువైన వ్యాసం. సాహిత్యచరిత్రకు సంబంధిం చిన త్రవ్వకం పని కొంత ఈ వ్యాసం లో కనిపిస్తుంది. సంగిశెట్టి శ్రీనివాస్ తొలికథను కనిపెట్టడానికి నడిచిన దారిలోనే నడుస్తూ ఇంకా అనేక కొత్త విషయాలను తెలియజేశారు. బం డారు అచ్చమాంబగారు రాసిన **'గుణవతియగు స్త్రీ'** (1901) ఇప్పటివరకు లభించిన కథల్లో మొదటిదని తేల్చటం జరిగింది. అయితే వీరే రచించిన **'ప్రేమ నిరీక్షణము' (1898) 'ఎరువు సొమ్ము పరువు చేటు' (1898)** కథల కోసం వెతుకులాట సాగుతున్నది. ఈ కథల్లో ఏది దొరికినా తొలి కథ పేరు మారుతుందే కాని, రచయిత్రి పేరు మారదన్నది మల్లారెడ్డిగారి అభిప్రా యం. ఆ తర్వాతి 70 సంవత్సరాల కాలంలో ఎందరో ప్రతిభావంతులైన తెలంగాణ కథకులు గొప్ప కథలు రాశారని, అవన్నీ ఊహాలోకంలో విహరింపజేసే కథలు కావని, ఎక్కువగా సామాజిక ఆర్థిక, రాజకీయ నేపథ్యాలు కలిగిన మట్టిమనుషుల కథలని భావించవచ్చు.

**'తెలంగాణ వర్ధమాన మేటి కథారచయిత దోరవేటి'** అంటూ ఒక వ్యాసాన్ని ప్రారంభించారు మల్లారెడ్డి గారు. దోరవేటి చెన్నయ్య **'బహుముఖ ప్రజ్ఞావంతుడ'**ని వారు ఊరకనే అన లేదు. కవిత్వం, చిత్రలేఖనం, సంగీ తం, శిల్పం, నటన- వంటి కళల్లో నిష్ణాతులు కనకనే అన్నారు. వీరి 'అంజలి-1, అంజలి-2' అన్న పద్య కావ్యాలను అనుశీలిస్తూ ఒక మంచి వ్యాసం రాశారు. రైతు మీద కవి రా సిన ఖండికను ప్రస్తుతిస్తూ- 'చేయి తిరిగిన' కవికే సాధ్యమయ్యే ఓ కరుణశ్రీ రచించిన పద్యంలా సాగే పద్యధార ఇది' అంటున్నారు. ఇది అతిశయోక్తి కాదఋ.

తెలంగాణ దీపస్తంభం, పరిపాల నాదక్షుడు ప్రజాసేవతత్పరుడు రాజా బహద్దూర్ కోత్వాల్ వేంకట రామారెడ్డిగారు. వారు విద్యార్థి వసతి గృహాల అభివృద్ధికి చేసిన సేవను పరిశోధనాత్మకంగా వివరించారు.

**'నాయనితో కాసేపు'**తో ప్రారంభ మయిన భూమయ్యగారి సంభాషణా త్మక వ్యాఖ్యానానికి 'చేరా' 'Down to Earth Approach' అనే అర్థంలో **'భౌమమార్గం'** అనే పేరు పెట్టారు. దృశ్య మాధ్యమ ప్రత్యక్ష ప్రసార వ్యాఖ్యాన పద్ధతిని శ్రవ్య కావ్య విమర్శా వ్యాఖ్యానానికి అన్వయించి చెప్పడం భౌమమార్గంలోని ప్రత్యేకత. భూమయ్యగారిలోని ఈ సంభాషణా త్మక వ్యాఖ్యానశైలిని సోదహరణంగా పేర్కొన్నాడు **'సంభాషణాత్మక భౌమ విమర్శ మార్గం'** వ్యాసంలో మల్లారెడ్డి.

దాశరథి **'అమృతాభిషేకం-ఒక పరిశీలన'** ఆ కవితా సంపుటి ఆధా రంగా దాశరథి కవిత్వ లక్షణాలను చెప్పటానికి ప్రయత్నించిన వ్యాసం. ఇందులోని **'తామసి'. 'దీపాంగన'** కవితలలో వేదాంతాల ప్రభావం కనబడుతుంది అంటున్నారు. ఇది విమర్శకుని పరిశీలనా ఫలితం. ఇది దాశరథి వేదాంత వ్యగ్రతనే కాక, బహుభాషా ప్రతిభను కూడా సూచిస్తున్నది. అంతేకాదు- **'దాశరథి రచన సంస్కృత పదభూయిష్టమైనా క్లిష్టంగా కాకసరళంగా ఉంటుంది. ఎలాంటి అడ్డంకులూ లేకుండా ధారగా సాగుతుంది'** అంటున్నారు. 'కాల్పనిక భావాల్ని వ్యక్తం చేసే సమయంలో లలితపదాల్ని ప్రయోగి స్తాడు' అని కూడా అంటున్నారు విమర్శకులు. ఈ వ్యాఖ్యలు శైలీ విన్యాసంలో దాశరథి ప్రతిభా వ్యుత్పత్తులను సూచిస్తున్నాయి.

తెలుగులో దేశీ సాహిత్యానికి వివిధ ప్రక్రియల ద్వారా ప్రచారాన్ని కల్పించి శైవతత్వాన్ని ఉద్యమరూ పంలో సామాన్యజనంలో ప్రవహిం పజేసినవాడు తొలితరం ప్రజాకవి పాల్కురికి సోమనాథుడు. పాల్కురికి చెన్నమల్లు సీసాలలోని శివభక్తి షట్ స్థల విధులను సౌకల్యంగా వివరిం చాడు పాల్కురికి చెన్నమల్లు సీసములు వ్యాసంలో.

తన అభిమాన వ్యాకరణ గురువైన మహా మహోపాధ్యాయ ఆచార్య రవ్వా శ్రీహరి సారు జీవిత సాహిత్య ప్రస్థానాన్ని చిన్నపాటి పరిశోధనాత్మక వ్యాసరూపం పరిమాణంలో పరిశోధించి చూపాడు మల్లారెడ్డి.

తెలంగాణ ఆధునిక సాహిత్యానికి కేంద్రబిందువుగా ఉన్నవారు నందిని సిధారెడ్డిగారు.

తెలంగాణ భాషా సంస్కృతుల పరిరక్షణకు నముడు బిగించి సాహిత్య ఉద్యమాలను నడిపినవారు కూడా సిధారెడ్డిగారే. వారిని గూర్చి తూర్పు మల్లారెడ్డిగారు **'సిధారెడ్డి:ఉద్యమాలు-సంస్థలు'** అన్న వ్యాసం రాయటం ముదావహం. తండ్రిగారి ప్రభావంతో తెలంగాణ రాజకీయ నేపథ్యాన్ని అవగాహన చేసుకున్న సిధారెడ్డిగారు సంస్కరణ భావాల ప్రభావంతో సంఘసేవకు పూనుకొని తమ నాయకత్వ పటిమను నిరూపించుకున్నారని తూర్పు మల్లారెడ్డిగారు భావిస్తున్నారు. సంపూర్ణ మద్యపాన వ్యతిరేకోద్యమం, గుట్కా ఉద్యమం, సామ్రాజ్యవాద వ్యతిరేకో ద్యమం, విప్లవోద్యమం, తెలంగాణ వ్యక్తిత్వ ఉద్యమం, మానవ హక్కుల ఉద్యమం- వంటి అనేక ఉద్యమాల లో పాల్గొన్నారు. వీటిలో చాలావాటికి నాయకత్వం వహించారన్నది తూర్పు మల్లారెడ్డిగారి భావన. సిధారెడ్డి గారిని దగ్గరగా చూసినవారు కావటం వల్ల తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ గారితో కలిసి, ఊరూరా ఉపన్యాసాలు ఇచ్చిన సందర్భాలను ప్రస్తావించారు. ఒరిస్సాలో సమైక్య వాదులు భౌతిక దాడికి పూనుకునే యత్నం చేసినా తమ తెలంగాణ అస్తిత్వవాదాన్ని చాటిచెప్పటానికి వెనుకాడ లేదని కూడా తెలియజేశారు. కేసీఆర్ ఉపవాసదీక్ష, మిలియన్ మార్చ్, విగ్రహాల కూల్చివేత, తెలంగాణ సాకారమైన తర్వాత ఎన్నికల ప్రచారసభల్లో పాల్గొనటం వంటి వాటిని మల్లారెడ్డిగారు వివరంగా తెలియజేశారు. 'మరసం', 'తెరవే', 'తెరసం' వంటి సాహితీ సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులుగా గ్రామీణ పట్టణ కవులు, రచయితల్లో ప్రజల్లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావ చైతన్యం ప్రోది చేయటానికి సిధారెడ్డిగారు చేసిన కృషి వారి అంకితభావానికి నిదర్శనంగా తూర్పు మల్లారెడ్డిగారు నిరూపించారు.

పొట్లపల్లి రామారావు స్వయం కృషితో ఎదిగిన కవి. కథా రచయిత, కాళోజీ సోదరులు, వట్టికోట ఆళ్వా రుస్వామి, వానమామలై వరదాచా ర్యులు, మహాకవి దాశరథి, దేవులపల్లి రామానుజారావు మొదలైన తొలితరం రచయితలతో ఉ ద్యమకారులతో సాగిన స్నేహజీవనం ఆయన రచనా వికాసానికి తొడ్పడింది. పొట్లపల్లి వారు గ్రామ చిత్రాల పేర రచించిన పద్నాలుగు స్వగతాలు/ఊహాచిత్రాల రచనల్లోని భావుకతను రమణీయంగా విశ్లేషించి చూపాడు.

కవి, అనువాదకుడు, తెలంగాణ రుబాయిలకర్త ఏనుగు నరసింహారెడ్డి **'కొత్తపలక'** కవితా సంపుటిలో తెలంగాణ అస్తిత్వ వేదనను వివరణా త్మకంగా విశ్లేషించి చూసి 'కొత్త పలక' అక్షరాలు తెలంగాణ అస్తి వేదనను ప్రజ్వలించిన దీపాంకురాలు' అని తూర్పు మల్లారెడ్డి సాభిప్రాయంగా తీర్పు చెప్పాడు.

కాళోజీ మీద చక్కని పరిశోధన చేసిన వ్యక్తి మల్లారెడ్డి, కాళోజీకి తెలంగాణ భాషపట్ల ఉన్న మమకా రాన్ని, తెలంగాణ భాషపట్ల ఆంధ్రుల కున్న అవహేళనా స్వభావాన్ని నిరసించి, ధిక్కరించి కాళోజీ ప్రతిఘ టనాశీలాన్ని, బడిపలుకుల కంటే పలుకుబడులతో సాగే రచనల్లోనే ప్రాంతీయ జీవన సౌందర్య ముంటుం దనే కాళోజీ నిశ్చితాభిప్రాయాన్ని సాభిప్రాయంగా వివరించి చూపాడు **'కాళోజీ భాషాదృక్పథం'** అనే వ్యాసంలో.

గంగుల శాయిరెడ్డి రచించిన 'కాపుబిడ్డ' కావ్యంలో ప్రతిఫలించిన కర్షక జీవితాన్ని సమగ్రంగా విశ్లేషించి చూపాడు.

తెలంగాణ మలిదశ పోరాటో ద్యమంలోని వివిధ సంఘటనలను కవిత్వీకరించి ఉద్యమ చైతన్య సుగం ధాన్ని అందించిన కవితా సంపుటి నా **'గంధం చెట్టు'**, ఈ కవితా సంపుటి లోని కవితల ఆత్మను విశ్లేషించి చూపిన తీరు కవికి సంతృప్తినిచ్చే రీతిలో సాగింది.

**'హరిభట్టు రచనలు- అనుశీ లనం', 'పొన్నికంటి తెలగన యయాతి చరిత్రము-ఒక పరిశీలన', 'కామినేని మల్లారెడ్డి కావ్యాలు- పరిచయం',** ఈ వ్యాసాల్లో మల్లారెడ్డి కున్న ప్రాచీన సాహిత్య అభినివేశం వ్యక్తమౌతుంది.

మొత్తమ్మీద తెలంగాణ అంశాల కు సంబంధించిన వ్యాసాలే ఈ 'అన్వేషణ' సంపుటిలో ఎక్కువగా కన్పిస్తాయి. విమర్శకుడు తెలంగాణ వాడు కావటం మాత్రమే ఇందుకు కారణం కాదు.

తెలంగాణ ఆధునిక సాహిత్యపు లోతులను అన్వేషించేపని ఇప్పుడిప్పుడు జరుగుతున్నది 2000 సంవత్సరం వరకు తెలంగాణ విమర్శ కులు కూడా సీమాంధ్రుల సాహిత్య విశ్లేషణ మీదే తమ దృష్టిని కేంద్రీ కరించేవారు. అట్లాంటి వ్యాసాలకే పత్రికల సాహిత్య పేజీలలో స్థానం దొరికేది.

దీంతో తెలంగాణ సాహి త్యం ప్రధాన స్రవంతిలో లేకుండా పోయింది. ఇప్పుడు నిన్నటి వివక్షకు లోనైన సాహిత్యాన్ని వాస్తవిక దృష్టితో, శాస్త్రీయ దృష్టితో, సాహిత్య దృష్టితో పరిశీలించి- ఇదిగో ఇట్లాంటి వ్యాసాలు రాయవలసిన అగత్యం ఏర్పడింది.

ఇది చారిత్రక అవసరం. ఈ దృష్టితో చూస్తే **'అన్వేషణ'** వ్యా సాలు విలువైనవి. అందుకే 'అన్వేషణ' సంపుటి విమర్శకుని కేవలం రచనల సంపుటి మాత్రమే కాదు. బాధ్యతతో చేసిన పరిశోధన వ్యాసాల సంపుటి అని భావిస్తున్నాను. వ్యాసరచనా కౌశలం కలిగిన డా॥ తూర్పు మల్లారెడ్డి గారిని ఇకముందు కూడా మరిన్ని వ్యాసాలను తెలంగాణ తల్లికి బహూకరించవల సిందిగా కోరుతున్నాను.



**-డా॥ అమ్మంగి వేణుగోపాల్**
9441054637

**డా॥తూర్పు మల్లారెడ్డి సాహిత్య వ్యాసాలు "అన్వేషణ"కు డా॥ అమ్మంగి వేణుగోపాల్ గారు రాసిన ముందు మాట**




**ప్రతులకు:**డా॥టి. మల్లారెడ్డి
ఇ.నెం.4-9-40/పి250, ప్రియదర్శిని కాలనీ
రోడ్ నెం.1, హయత్‌నగర్
రంగారెడ్డి జిల్లా-501 505
సెల్: 98491 92154

**అప్పుడైనా, ఇప్పుడైనా ప్రక్రియ ఏదైనా సృజనాత్మక రచనకు అగ్రతాంబూలం ఇవ్వవలసిందే. ఆ తర్వాత ఆ సృజనాత్మక రచన బాగోగులను బేరీజు వేసేది వచన సాహిత్య ప్రక్రియ అయిన వ్యాసమే.**

---

## యోగ ఆటవెలది పద్యాలు

ఆత్మ తత్వ మిదియె యనుకరించి జనులు
యోగ వలన కలుగు యోగ మిదియె
ప్రాణమునకు హాయి ప్రాణాయమము చెయ
చేయు సాధనమ్ము చింత లేక..!.

శ్వాస తోటి నిలుచు చక్కటి యాయువు
ఆసనాలు నేర్వ అవని లోన
అదుపు లోన వుంచు యారోగ్యము మనకు
చేయు సాధనమ్ము చింత లేక..!.

చక్క నైన యోగ సాధన చేయగా
మేలు కలగ జేయు మేదినందు
మార్గ మిచ్చు మనకు మహినందు యోగయె
చేయు సాధనమ్ము చింత లేక?!.

సకల రోగములకు సరైన మందిది
రోజు చేయ తగ్గు రోగమిలన
ఆగకుండ సెయగ ఆయుష్షు పెంచుగా
చేయు సాధనమ్ము చింత లేక..!.

నెమ్మది కలిగించు తీరుగా వుంచేటి
శ్వాస ధ్యాన ముద్ర జనులు చేయ
ఆత్మ తత్వమిదని యంతయు పాటింప
చేయు సాధనమ్ము చింత లేక..!.

అంతరంగ ముందు నాలోచనలు బాపి
శాంతి దారి చూపు చక్కగాను
నిత్యము జనులకును నెమ్మది కలిగించు
చేయు సాధనమ్ము చింత లేక..!.

ధ్యాన సాధనమ్ము తనువుకారోగ్యమ్ము
అంద జేయు యోగ అద్భుతంబు
ఆసనాల తోటి ఆందోళనలు బాపు
చేయు సాధనమ్ము చింత లేక..!

మేలు చేయు యోగ మేటి ఫలితమును
అందజేత నందు ఆదిగాను
శుభము కలుగ జేయు సున్నితముగ యోగ
చేయు సాధనమ్ము చింత లేక..!

సూర్య నమనములతొ చూపుగా దారిని
తరగిపోని యోగ వరమునిచ్చు
పెంచు జీవనమ్ము బెంగను తీర్చుగా
చేయు సాధనమ్ము చింత లేక..!.

మంచి చేయు యోగ మహినందు వుండగా
చింత చేయవలదు చేయు యోగ
యవ్వనమును యిచ్చు యద్భుత యౌషది
చేయు సాధనమ్ము చింత లేక..!



**- సునీత బండారు**
9440671530

## నిండు చందమామా!

పున్నమి చందమా
చక్కనీ బింబమా
ఆకాశ దీపమా
మనుజుల మురిపెమా ॥అందమా॥
పుడమికి వెలుగువా
మోములా జిలుగువా
చల్లనీ వెన్నెలవా
తెల్లనీ వన్నియవా
మనసులా దోస్తావా
మోదమూ ఇస్తావా
హృదినీ తడతావా
హాయినీ కొలిపెదవా ॥అందమా॥
ప్రేమను రేపుతావా
చెలియను చేరుస్తావా
సరదా చేయిస్తావా
సరసం ఆడిస్తావా
కబుర్లు చెప్పిస్తావా
కాలము గడిపిస్తావా
కులుకులు చేరుస్తావా
తళుకులు చిమ్మిస్తావా ॥అందమా॥
కోర్కెలు తీరుస్తావా
బ్రతుకును పండిస్తావా
పువ్వులు పూయిస్తావా
నవ్వులు కురిపిస్తావా.
మాటలు కలుపుతావా
బాటలు చూపుతావా
ఆటలు ఆడిస్తావా
పాటలు పాడిస్తావా ॥అందమా॥
వెలుగులు చిమ్ముతావా
తాపాలు తీరుస్తావా
కోపాలు తగ్గిస్తావా
మోములు మెరిపిస్తావా
అమృతము అందిస్తావా
తేనియలు చిందిస్తావా
ముద్దులూ గుప్పిస్తావా
ముచ్చటా పరుస్తావా
॥అందమా॥



**-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**
సెల్:7981616630

## 50 ఏళ్ల మహిళ హృదయ రాగం

ఆమె జీవితము గాథలతో నిండిన పుట,
అనుభవాల గాథల గీతం.
ఒకవైపు హార్మోన్ల తుఫాను,
మరోవైపు పరిపక్వతా దీపం ఆమెతో
ప్రయాణం చేస్తూనే ఉంటుంది.
పిల్లల భవిష్యత్తు తలపులలో,
తనకోసం సమయం వెదుకుతూ,
ఆత్మపరిశీలనలో మునిగిపోతూ,
కొత్త వెలుగుల్ని కనుగొంటుంది.
చిరునవ్వులలో దాగిన అలసట ఆమెది,
కన్నీటిలో మెరిసే బలం.
ఒంటరితనం తాకినా,
స్వప్నాలు తోటలో పూసే పూల సువాసన
ఆధ్యాత్మికతలో శాంతి వెదుకుతూనే,
భగవంతుని సేవలో
సంతోషం వేతుకొనే మనస్తత్వం తనది
ఆమె ఒక అనుభవం అనే అమూల్య ఆభరణం,
పరిపక్వత అనే శిరోభూషణం.
ఐదు దశాబ్దాల తర్వాత కూడా,
ఇది ఆమెకు
ఒక ముగింపు కాదు - పునరారంభం.
ప్రతి క్షణం సజీవ కవిత్వమే,
50 ఏళ్ల మహిళ హృదయ రాగం.

**-గుజ్జరి అనిత**

## పాదాలు

పద్ధతులను పక్కకు పెట్ట నివ్వని - ప్రగతి రథాలు - పాదాలు
పదుగురి చేత - కొనియాడేలా చేసే - ప్రమోదాలు - పాదాలు
పని అయ్యాక - పాతర వేసే పన్లు చేయ నివ్వని - పంచ గవ్యాలు
పసిడి పంటలు - పండినంత పరవశాలనందించే - ప్రక్వాణములు - పాదాలు.

పామరుడు కూడా - ఎదిగేలా చేసే - ప్రణవ నాదాలు - పాదాలు
పాయసంలా - పద పంథాను కదిలేలా చేసే - ప్రతినిధులు - పాదాలు
పాపపు పన్లు చేయ నివ్వని - పంచపాత్రలు - పాదాలు
పారంగతుడుగా - ప్రసిద్ధి పొందేలా చేసే - పంచాగ విశేషాలు - పాదాలు.

పాదుషాలా - అలరించేలా చేసే - పంచవర్ణ ప్రణాళికలు - పాదాలు
పిల్లనగ్రోవిలా వినుతి కెక్కేలా చేసే - పంచశీల సూత్రాలు
పాడు చేసే బుద్ధులకు తావివ్వ నివ్వని - పంచామృతాలు - పాదాలు
పాలు - నీరులా - కలిసిపోయేలా చేసే - పంచాంగ విశేషాలు - పాదాలు.

పాంచజన్యంలా - అలరించే - ప్రకృతి లోని - పత్రహరితాలు - పాదాలు
పదుగురూ - పదే - పదే కొనియాడేలా చేసే - పూర్ణచంద్రికలు - పాదాలు
పర్లేదు - పర్లేదు అంటూనే రాబందుల్లా మార నివ్వని - ప్రతీకలు - పాదాలు.

ప్రతి విధానంలోనూ విశ్వస నీయతను - పారవశ్యతను -
గంగా ప్రవాహ - స్నేహ రేఖలను - అందించే ప్రసాదాలు పాదాలు.



**-లంకా వెంకట సుబ్రహ్మణ్యం**
సెల్: 9440448650.

## తలరాత

ఎంత గొప్ప
రాతలు రాసినా ఏమి లాభం
తన తలరాతను రాయలేని
రచయితగా మిగిలిపోతే
ఆకాశం గీసిన అక్షరాలు
చెరగనివి
భూమి గీసిన గీతలు
ముడుచనివి
చేతిలో కలం ఉంటే
ప్రపంచం వంగుతుంది
హృదయంలో స్వప్నం ఉంటే
చరిత్ర మారుతుంది
కానీ తలరాత గీతలు మాత్రం
కదలవు
ఆ గీతల ముందర
మహాకవులైనా మరుగుజ్జు నక్షత్రాలే
మనిషి రాయగలిగింది సత్యమే
కానీ రాయలేనిది స్వాగతం
అదే మిగిలిపోతుంది ఒక శూన్యంగా
రచయిత గుండెల్లో నిశ్శబ్ద గీతంగా
అయినా కలం ఆగిపోదు,
స్వరం చల్లారదు
తలరాత రాయలేని చేతి నుండి
విప్లవం పుడుతుంది
సంకెళ్లను విరిచే గీతలు
అక్షరాల్లా ఎగురుతాయి
విధిని ఓడించిన ధైర్యమే
కొత్త తలరాతగా నిలుస్తుంది



**-పోలీస్ భీమేశ్**
9505255218

## ప్రేమ చినుకులు

స్వాతి చినుకుల సవ్వడిలో..
వయసు దేహం స్నానమాడేను!
నవ్వుల ఊహల జాబిల్లిలో..
చెలివలపులు ప్రేమగీతం పాడేను!
మేఘాలు కురిసే చినుకులో..
తలపు తనువులు పులకించిపోయేను!
నెచ్చెలి వెన్నెల తలపులలో..
మనసు ఊపిర్లు ఊయాలుగేను!
వర్షించే స్నేహ చినుకులలో..
హృదయ మయూరం తొణికిసలాడేను!



**-డాక్టర్ పగిడిపల్లి సురేందరు**
8074846063

## ఓ మానవా.. తెలుసుకో

ఒక చిరునవ్వుతో అందరినీ కలుపుక పో..
క్షణికమైన కోపాన్ని అర క్షణంలోనే వదిలేసుక పో..!

జీవితంలో మిత్రులను భాగం చేసుకో..
శత్రువు అనే వాడను లేకుండా చేసుకో.!

మాటలన్నిటిని ప్రేమగా మాట్లాడడం
అలవాటు చేసుకో..
నీవంటే ఒక నమ్మకం అని
అందరి నోట అనిపించుకో.!

బంధం ఏదైనాఅనుబంధంగ
ఉండేలా సరిచేసుకో...
విభేదాలు ఎన్ని ఉన్నా ఎవరితో
విడిపోకుండా ఉండేలా చూసుకో.!

నీలో మంచి అన్నది పెంచుకో..
లోపల ఏమైనా ఉంటే సరి చేసుకో..!

ఈర్ష్యా ద్వేషాలు.. అసూయా
అహంకారాలను విడనాడుకో..!
ప్రేమ అనురాగం..ఆప్యాయత,
అనుబంధం వెంట నింపుకో..!!



**-ఎన్.రాజేష్**
9849335757

నాటి తరం వారి కథలు నేటి తరానికి

**కథల వంతెన**

# నాగులు

కథ

2003లో రాసిన కథ

ఊరి బయట చెరువు వార ఓ పాతిక దాక బిక్షగాండ్ల గుడిశెలు. వాళ్లకోళ్ళు కుక్కలు గాడిదల అరుపులు చిన్నపిల్లల ఏడ్పులు. ఆ ఉదయం పూట ఒకటే సందడి గుడిశెల ముందల పొయ్యిల మీద ఆడవాళ్ల వంటలు. వారం రోజుల తుపాను వెలిసి ఈ రోజే కాస్త తెరిపినిచ్చింది. మబ్బులమాటు నుండి సూర్యుడు బయటకు వచ్చాడు. వారంరోజుల వర్షంతో వాళ్ల బతుకులు అతలాకుతలమయ్యాయి. ఊళ్ళోకి పోతేనే పూటగడువని వాళ్లు వాన పుణ్యమా అని గడపదాటలేదు. గుడిశెల్లో వున్నకాడికి అయిపుచ్చారు. అర్ధాకలితో గడిపిన బిక్షగాండ్లు యాదచనకై వేషాలు వేస్తున్నారు. హరిదాసు, పిట్టల దొర, జంగం దేవర, గోసంగి బుర్రకథల వాళ్లు, ఎవరికి వచ్చిన విద్యలో వాళ్లు వేషాలు కడుతున్నారు. ముఖాల మీద

> "కోటప్ప నాగస్వరంతో, పాముల బుట్టలతో ఊర్లోకి ప్రవేశించాడు. నాగస్వరం తన తండ్రి దగ్గర నేర్చుకున్నాడు. నాగస్వరం పాటకు జనం గుంపులుగుంపులుగా చేరుకున్నారు. ఉండి ఉండి ఓ పెద్ద మనిషి "ఆ బుట్టలోని పాముని తీసి ఆడించరాదూ ఇంత బాగా పాడుతున్నావు"

బొట్లు దిద్దుకుంటున్నారు. కట్టుబొట్లు కాళ్ళకు గజ్జెలు కట్టుకుంటున్నారు. నిజానికి వాళ్ళంతా బిక్షగాల్లు కాదు. గతంలో గ్రామాలల్లో వీధిభాగవతాలు, తోలు బొమ్మలాటలు ఆడించిన బుడిగజంగాలు వాళ్లు నల్లగొండ దగ్గరి శేషమ్మగూడెం వాల్లది. లోగా గ్రామ గ్రామాన తిరిగి వందలకొద్ది నాటకాలు ఆడి తోలు బొమ్మలాడించి బాగా బతికిన వాల్లె. కాలానుగునంగా వచ్చిన టీవీల సీరియల్లు, సినిమాల ప్రభావంతో వాళ్లబాగోతం చూసేవాళ్లే కరువయ్యారు. గతంలో ఓ ఇరువయి నాటకాలు ఆడించిన ఊర్లల్లో ఒక్క నాటకానికి, నోచుకోవడం లేదు తోలు బొమ్మలాట సరేసరి, వాళ్ల బొమ్మలపెట్టెలు ఎప్పుడో మూలపడ్డాయి. పోటీలు పడి ఆడించిన గ్రామాలు ఇపుడు తమను ఈసడించుకుంటున్నాయి. బ్రతుకు దెరువుకోసం ఇప్పుడు నానా వృత్తులు ఎంచుకున్నారు. పాతినుము పాతపేపర్లు వ్యాపారం కొందరు, కప్పల వ్యాపారం కొంతకాలం చేశారు. కొంతమంది కళను చంపుకోలేనివారు ఓ హార్మోని పెట్టె మద్దెల తాళాలు తీసుకుని బస్తీల దుకాణాల వెంట తిరిగి పాటలు పద్యంతో పాడి పది పరక అడుక్కుంటున్నారు. కొంతమంది ఇలా ఊర్లమీద పడి తమకు వచ్చిన విద్యతో గ్రామాలల్లొ గడపగడప తిరిగి తమ విద్యలు చూపి ఇన్ని బియ్యం పదోపరకో సంపాదించి పూట గడుపుకుంటున్నారు. ఏ ఊరికి పోయినా పదిమంది కలిసే వెళతారు ఎవరికి తోచిన వేషం వాళ్లు వేసుకొని పొట్ట పోసుకుంటున్నారు.

ఈ వారం రోజుల ముసురులో కోటప్ప భార్య ప్రసవించింది పండంటి మగపిల్లవాడు. ఈ ఈదురు గాలికి తట్టుకోలేక బాలింత రోగంతో హరీమంది. గుడిశెల వాళ్లంతా పదీ పరక వేసుకుని కర్మకాండ పూర్తిచేశారు. పసిగందుది ఒకటే ఏడుపు. ఆ పిల్లవాన్ని ఏలా సాకాలో కోటప్పకు బోధపల్లేదు. పక్క గుడిశె చిన్నపిల్లతల్లి రంగనాయకి ఓ నాలుగు రోజులు తనపిల్లవానితో పాటు ఈ పిల్లవానికి పాలిచ్చింది. ఈ రోజు నుండి నీ బాధ నీదే అని పిల్లవాన్ని గుడిశెలో పడేసి వెళ్ళిపోయింది. కోటప్ప భార్యను తలుచుకుని చాలాసేపు ఏడ్చాడు. ఆకలికి తట్టుకోలేక పిల్లవాడు ఒకటే ఏడుపు. కోటప్పకు ఏం తోచడం లేదు. పిల్లవానికి పాలెట్లా? ఎలా సాకాలి? ఇదే ఆలోచన.

"ఒరేయి కోటప్పా ఎన్ని రోజులు అలా ఏడుస్తూ కూసుంటావురా! నీకు ఎనకా ముందెవరున్నారు. అలా ఊల్లోకెల్లు. ఇంత అన్నం ఇన్ని పాలు దొరుకుతాయి." ఓ ముసలవ్వ వచ్చి ఓదార్చి చెప్పింది. కండ్లు తూడ్చుకుని కోటప్ప వేశంకట్టాడు. ఓ దొవతి తీసి ఉయ్యాలకట్టాడు. గుడిసెపై క్రకు కట్టాడు ఊపి పిల్లవాన్ని నిద్రపుచ్చాడు. జోలె సంకకు వేసుకున్నాడు. జోలెలో ఓ గిన్నె ఓ పాలసీసా వేసుకుని ఊర్లోకి బయలుదేరాడు. తనతోటి వాళ్లంతా ఎప్పుడో వెళ్ళిపోయారు. నాలుగిండ్లు తిరిగేసరికి తనగిన్నె నిండిపోయింది. ఊరి మధ్య ఓ బోరింగు దగ్గర ఓ చెట్టు క్రింద కూర్చుని లాగించేశాడు. మూడు రోజుల ఉపావాసమున్న పొట్టను నింపేశాడు. బోరింగు దగ్గర నీళ్లుతాగాడు. అప్పటిగ్గాని పిల్లవాని ఏడుపు సంగతి గుర్తుకు రాలేదు. చంటోడికి పాలు లేకపోతే ఈ రాత్రికి వాడు బతుకుతాడా. సీసాపట్టుక ఊర్లోకి బయలుదేరాడు.

" అమ్మా తల్లీ! నా పెళ్ళాం పురిట్లో సచ్చిపోయిందమ్మా.. చంటాడికి పాలు లేవుతల్లీ గిన్ని పాలు పోసి పుణ్యం కట్టుకోండి తల్లీ. పసిగందు పానాలు రచ్చించండమ్మా"

గడపగడప తిరిగాడు. తనగోడు చెప్పుకున్నాడు. కోటప్ప మాటలు ఎవరు నమ్మలేదు. "బయట తిరిగే ముండాకొడుకులు గంటకోవేసంవేస్తారు. ఇప్పుడే గిన్నెడు అన్నం పెట్టాం. బాగా మెక్కి ఇప్పుడో కొత్తనాటకం ఆడుతున్నాడు. పెళ్ళాంచచ్చిందని ఒకడు, ఇల్లుకాలిందని ఒకడు, భూకంపాలని ఒకడు. తుపాన్ల కొట్టుకపోయాయని ఒకడు కష్టం చేయవొల్లంగక ఈ వేషాలు. పాలుకావాల పాలు. అయ్యా మీరు కొనిచ్చిన బర్లు ఆవులు లేవు, పాలు పొసెందుకు వెళ్ళు వెళ్ళు.. వెధవ వేషాలెయ్యకు."

తలా ఓ మాట తిట్టిపోశారు. తను ఎన్నిసార్లు చెప్పినా ఎంత చెప్పినా తనగోడు ఎవ్వరు వినేట్టులేరు. కాళ్లీడ్చుకుంటూ గుడిశె చేరుకున్నాడు. పిల్లవాడు ఒకటే ఏడుపు. అందరి గుడిసెల ముందర సందడే సందడి. తన భార్య లక్ష్మీవుంటే ఈ పాటికి వండి వుంచేది. ఇద్దరు కలిసి తినేవాళ్లు మిగతా గుడిశెల్లో పెళ్ళాం మొగుళ్ల సరససల్లాపాలు పిల్లలకేరింతలు. కోటప్పకు దుఃఖం ముంచు కొచ్చింది. పిల్లవాన్ని భుజం మీదేసుకున్నాడు. అటూ ఇటూ ఊపాడు. నీల్లు పట్టించాడు అయినా ఒకటే ఏడుపు. ఆ పసికందు ఆకలి కోకేకలు. ఎలా అయితే అలా అయిందని నిన్నా మొన్నా పాలిచ్చిన రంగనాయకమ్మ గుడిశె దగ్గరికి పోయాడు" అక్కా ఈ ఒక్క పూట గుక్కెడు పాలియ్యక్కా. రేపట్నించి ఏలాగయిన పాలు



సంపాయిత్తాను".

చూడు కోటన్నా. ఏదో రెండు రోజులు పిల్లవాడ్ని చూడలేక పాలిస్తె మావాడుపాలు సాలక రాత్రి పూట ఒకటే ఏడుపు. రాత్రిపూట నన్ను పండనీయడు. పట్టిన చన్ను వదలడు. ఈ ఒక్క పూట ఏముఖం చూసి పాలిస్తా, ఇక రాకు తమ్మీ" రంగనాయకమ్మ పిల్లవాన్ని తీసుకొని పాలిచ్చింది. చీకటి పడింది కుక్కల అరుపులు గాడిదల ఓండ్రలు. ఎవరిగుడిశెల్లో వాళ్లు దూరి తడికెలు వేసుకున్నారు. కోటప్ప పిల్లవాడ్ని పక్కల వేసుకుని కుక్కిమంచంలో పడుకున్నాడు. ఎపుడో మధ్యరాత్రికి గాని నిద్రపట్టలేదు. పిల్లవాడు మాత్రం తాగిన పాలమత్తుతో కిక్కురు మనకుండా నిద్రపోయాడు.

తెల్లవారింది మళ్లీ ఎవరి వేషాలు వాళ్ళు వేసుకుంటున్నారు. ఎవరు ఏ ఊరు పోవాలా అని తర్జన భర్జనలు పడుతున్నారు. ఒకరు వెళ్లిన ఊరికి ఇంకొకరు వెళ్ళరు. ఏ ఊరెళ్ళినా ఎవరో ఒకరు వెళ్లాల్సిందే. పోటీ మాత్రం పడరు. ఇది వాళ్ల కులకట్టుబాటు. చంటోడు మళ్లీ ఏడుపు మొదలు పెట్టాడు. సీసా తీసుకొని సీసానిండా నీళ్లుపట్టి వాని నోట్లో పెట్టాడు కోటప్ప. గబగబా తాగేడు పిల్లవాడు. భుజం మీద వేసుకుని నిద్రపుచ్చాడు. తనుచిన్నప్పుడు ఎన్ని ఊర్లు తిరిగాడు. ఎన్ని నాటకాలు ఆడాడు. ఎన్ని బొమ్మలాటలు ఆడాడు. ఏ ఊరికి పోయినా మాది ముందాట అంటే మాది ముందాట అని ఒక్కొక్క ఊర్ల ఎన్ని ఆటలు ఆడించేవారు. రెడ్లు, కోమట్లు, చాకల్లు, గొల్లలు, గౌండ్లు, పోటీలు పడి ఆటలు ఆడించేవారు. తమతండ్రి తాతలవెంట ఏ కల్లానికి పోయినా కుండెడు తూమెడు వడ్లు దానాలు పెట్టేవాళ్ళు. తాగినంత కల్లు గౌండ్లు పోసేవాళ్లు గొల్లవాళ్లు మేకలనిచ్చే వాళ్లు. టీవీలు వచ్చి తమ పొట్టలు గొట్టాయి. తమ ఆట పాట వినేనాధుడే కరువయ్యాడు. బాలకృష్ణ వేషం తను ఎంచక్కా వేసేవాడు. తెల్లవారి ఎంతమంది ఆడవాళ్లు తన నెత్తుకొని ముద్దాడేవారు. ఓహొ ఆ రోజులు ఇకరావు. తాము బొమ్మలాటలాడితే ఎంత బాగుండేది. తమ తాత బొమ్మలాడిస్తుంటె తెరవెనుక తామంతా మద్దెల తాళాలు గొడుతుంటే ఎంతమంది చూసేవారు. బండ్ల మీద జనం ఒక ఊరి నుండి మరో ఊరుకు వచ్చేవారు. బుడ్డ కేతిగాడు బంగారక్కల బొమ్మలు ఏంచక్కా ఆడించేవాల్లమో. ఒక్కొక్కరికి కేతిగాడు, బోల్‌బలా చెప్పేవాడు. వెంకట్‌రెడ్డి పటేల్ బోల్‌బలా, రంగారావు దొర బోల్‌బలా, మడేల్ జంగయ్యగారు బోల్‌బలా, గొల్లపెద్దమల్లయ్య గారు బోల్‌బలా ఇలా ఊరిపెద్దలందరికి నమస్కరించి బొమ్మలాట మొదలయ్యేది. తెల్లవారి తమకు బస్తాల నిండా వడ్లేవడ్లు పోటీలు పడి తమ వడ్లు బండ్లమీద వేసుకుని తమ ఊరికి చేర్చేవారు. ప్చ్ ఇక ఆ కాలం రాదు. పిల్లవాడు అటు ఇటు కదలసాగాడు.

ఈ లోకంలోకి వచ్చిన కోటప్ప పిల్లవాడ్ని మంచంలో వేసి జోకొట్టాడు. ఈ రోజు వీడికి పాలెట్లా సంపాదించాలా అని ఆలోచిస్తున్నాడు. అతని మెదడులో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. ఎప్పుడో తన అయ్య మూలన పడేసిన పాముల బుట్టలు బయటకు తీశాడు. కావిడికి ఓవైపు పెద్దపాముల బుట్ట, దాని మీద చిన్న బుట్ట, ఆపైన నాగస్వరం కొన్ని తెల్లఉసిరి వేసుకున్నాడు. కావిడికి ఇంకొవైపు జోలె, అన్నంగిన్నె, పాలసీసా వేసుకున్నాడు. నాగస్వరం చేతికి తీసుకున్నాడు. ముఖాన బొట్లు పెట్టుకొన్నాడు. తలపాగ కట్టుకున్నాడు. చేతులకు కడియాలు తాయెత్తులు వేసుకున్నాడు.

కోటప్ప తండ్రి నాటకాలు ఆట మానేశాక పాముల్నిపట్టి ఆడించేవాడు. వాటితోళ్లు అమ్మేవాడు. ఆ విధంగా అతనికి బాగానే గడిచింది. ఓ రోజు కొత్తగా పట్టి తెచ్చిన కొడెనాగు కోటప్ప తల్లిని కరిచి పొట్టన బెట్టుకుంది. ఆ రోజు నుండి పాముల పట్టడం ఆడించడం మానివేశాడు. ఆ పాముల బుట్టలు నాగస్వరం అన్నీ మూలబడే వున్నాయి. ఏ ఊరెల్లినా అన్నీ తమవెంటే తిరుగుతున్నాయి.

కోటప్ప నాగస్వరంతో, పాముల బుట్టలతో ఊర్లోకి ప్రవేశించాడు. నాగస్వరం తన తండ్రి దగ్గర నేర్చుకున్నాడు. నాగస్వరం పాటకు జనం గుంపులుగుంపులుగా చేరుకున్నారు. ఉండి ఉండి ఓ పెద్ద మనిషి "ఆ బుట్టలోని పాముని తీసి ఆడించరాదూ ఇంత బాగా పాడుతున్నావు" అన్నాడు.

కోటప్ప గుండె గుభేల్‌మంది. పాముంటే గదా ఆడించడానికి. తమాయించుకున్నాడు.

"అమ్మో యిది కొడె త్రాచు. నిన్ననే మనవూల్లోనె పట్టాను. కోరలు పీకలేదు. విషం తీయలేదు. నాల్గురోజుల్లో ఆ పని చేసి ఆటనేర్పి మీ అందరి ముందు ఆడిస్తా"

"అవున్లే చిన్న పిల్లలతో పని. అది పొరపాటుకి ఎవరినైనా కాటెస్తె ఇంకేమన్నా వుందా! వద్దులే విషం తీసాకే ఆడించు" ఇంకో పెద్ద మనిషి సలహా.

"అమ్మా తల్లీ నాగన్నకు దండం పెట్టండ్రి. గిన్నిపాలు పోయండ్రి. మా నాగులుకు పాలుపొస్తే మీరు పుట్టలో పాలు పోసినంత పుణ్యమొస్తుంది తల్లీ". "ఒరేయ్ నాగులూ అమ్మగారిని పిల్లలను అయ్యగారిని సల్లగవుండాలని దీవించురా" నాగస్వరంతో బుట్టను కొట్టాడు. గడప గడపకు ఇవే మాటలు. తలా ఓ తెల్లుసిరి తాయెత్తిస్తున్నాడు. అమ్మా ఈ తెల్లుసిరి ఈతాయెత్తు దగ్గరుంటే మీ జోలికి ఏ పాము రాదు. "ఇది పిల్లలకు కట్టురితల్లీ ఏ రోగము నొప్పిరాదు."

కోటప్ప ఈ మాటలు అందరు నమ్మారు. క్షణాల మీద కోటప్ప పాలసీసా నిండిపోయింది. జోలె వడ్లతోనిండింది. నాగరాజు కిష్టమని కోడిగుడ్లు యిచ్చారు. పాలుపోశారు.

> క్షణాల మీద కోటప్ప పాలసీసా నిండిపోయింది. జోలె వడ్లతోనిండింది. నాగరాజు కిష్టమని కోడిగుడ్లు యిచ్చారు. పాలుపోశారు. తాయోత్తులకు డబ్బులు వచ్చాయి. కోటప్ప మనస్సు ఆనందంతో నిండిపోయింది. గబగబా గుడిశెకు చేరుకున్నాడు. పిల్లవానికి కడుపునిండా పాలు పట్టించాడు. గిన్నెనిండిన అన్నంతో తన కడుపు నింపుకున్నాడు. నిన్న తను వెళితె ఈసడించి తరమేసిన ఈ జనం ఈ రోజు నాగరాజు పేరు చెపితే పాలతో ముంచెత్తారు. నిజం చెప్పి ఎంత బ్రతిమాలినా నమ్మని ఈ లోకం అబద్ధాన్ని ఎంతసులువుగా నమ్మింది! అమ్మా తల్లీ పిల్లవాడు ఏడుస్తున్నాడంటే ఈడ్చి కొట్టి ఈసడించిన ఈ జనం లేనిపాముకు పాలు పోశారు! ఈ లోకం సంగతి కోటప్పకు అంతుపట్టలేదు. మనస్సులో నాగరాజుకు దండం పెట్టుకున్నాడు. ఆ రోజు నుండి కొడుకుకు "నాగులు"

తాయోత్తులకు డబ్బులు వచ్చాయి. కోటప్ప మనస్సు ఆనందంతో నిండిపోయింది. గబగబా గుడిశెకు చేరుకున్నాడు. పిల్లవానికి కడుపునిండా పాలు పట్టించాడు. గిన్నెనిండిన అన్నంతో తన కడుపు నింపుకున్నాడు. నిన్న తను వెళితె ఈసడించి తరమేసిన ఈ జనం ఈ రోజు నాగరాజు పేరు చెపితే పాలతో ముంచెత్తారు. నిజం చెప్పి ఎంత బ్రతిమాలినా నమ్మని ఈ లోకం అబద్ధాన్ని ఎంతసులువుగా నమ్మింది! అమ్మా తల్లీ పిల్లవాడు ఏడుస్తున్నాడంటే ఈడ్చి కొట్టి ఈసడించిన ఈ జనం లేనిపాముకు పాలు పోశారు! ఈ లోకం సంగతి కోటప్పకు అంతుపట్టలేదు. మనస్సులో నాగరాజుకు దండం పెట్టుకున్నాడు. ఆ రోజు నుండి కొడుకుకు "నాగులు" పేరు పెట్టుకుని ముద్దుగా పిలుచుకున్నాడు.

**-మేరెడ్డి యాదగిరిరెడ్డి**
9949415796



1996లో రాసిన కథ

# అమావాస్య చీకటి

కథ

-దూపాటి శేషుకుమారాచార్యులు
సెల్: 9441884744

"డాక్టరు బెడ్ నెంబరు 10 పేషంటు కడుపు నొప్పిని గిలగిల కొట్టుకుంటున్నారు. అర్జంటుగా రండి.. అని పిలిచింది సిస్టర్ "వస్తున్నపద" అంటూ వడివడిగా పరిగెత్తేడు డాక్టర్ భానుమూర్తి.

పేషంటు రిపోర్టులు అన్ని పరీక్షగా చూసాడు. స్కానింగు అవన్నీ చూసి ఆపరేషన్ చేయాలని చెప్పాడు. వాళ్లవాళ్లను పిలిచి డబ్బులు ఏర్పాటు చేసుకోమని దీనికంటే ముందుగా ఈ కాగితాలమీద సంతకం చేయమని ఇంజెక్షన్ చేసాడు రాజారావు కళ్లు మూసుకున్నాడు.

రాజారావు కంట్రాక్టరు గుమస్తా పనిచేస్తూ తమ అబ్బాయి కుమార్‌ని ఇంజనీరుగా చూడాలనే కలగన్నాడు. అదేమాట చెప్పాడు. కష్టపడి చదవాలి నీవు నన్ను ఇంజనీరుగా చూడాలని వుందని చెప్పాడు.

రోజులు గడుస్తున్నాయి. కుమార్ ఇంటర్ స్టేట్ ఫస్టు వచ్చాడు. బి.టెక్‌ను గుల్బార్గలో చెర్పించాలని ప్రయత్నం చేసాడు. కుమార్‌కి మంచి ఆఫర్ వచ్చింది. హైదరాబాద్‌కు దూరంగా నైన పంపించి మంచి కాలేజ్‌లో చేర్పించాలని గుజరాత్ స్టేట్‌లో. దానికి బొంబాయి దగ్గర కదా!

రాజారావు భార్య సుధా ఇద్దరు కలిసి కొడుకును ట్రైన్ ఎక్కించడానికి సికింద్రబాద్ స్టేషన్‌కు వచ్చారు. మంచి చెడ్డల గురించి చెప్పారు.

"చూడు కుమార్ మంచి ఫ్రెండ్‌ను చూసుకో చెడు తిరుగుళ్లు తిరిగిన కష్టపడి చదివి గోలు రీచు అవ్వాలి" అన్నాడు రాజారావు.

"చూడు నాన్న నీపైనే ఆశలు పెంచుకున్నాము. నీ ఆరోగ్యం జాగ్రత్త నాన్నగారు చెప్పినట్లు నడుచుకో పూటకు భోజనం చేయి. డబ్బు ఖర్చు గురించి ఆలోచించకు ఒకవేళ రూంలో చేసుకోలేకపోతే బయటన్న భోజనం చెయి అని చెప్పింది. సుధ కళ్లలో నీల్లు సుడులు తిరుగుతుండగా హైద్రాబాద్ నుండి బొంబాయి వెళ్లే దాద్రా ఎక్స్‌ప్రెస్ ఎక్కించి వెనక్కి తిరిగారు. ప్రేమతో వస్తున్న కళ్లనీళ్లను తుడుచుకుంటు.

రాజారావు వాళ్లది ఆదోని కష్టపడి చదివాడు బి.ఎ. పూర్తి చేసి ఒక కాంట్రాక్టరు దగ్గర గుమస్తాగా చేరాడు. తర్వాత సుధను పెళ్లి చేసుకున్నాడు. కొడుకును మాత్రం గుమస్తాగా కాక ఇంజనీరుగా చూడాలనే తపనపడ్డాడు. సుధ పేరుకు తగ్గట్టు సౌమ్యురాలు. భర్త ఏది చెప్పిన సరే అనడం తప్ప ఎప్పుడు వాదించడం కాని విసుగొవడం కాని చేసేది కాదు. అలాంటి సంసారం లోకి మూడ వ్యక్తిగా కుమార్ పుట్టాడు.

బొంబాయి చేరిన కుమార్ గుజరాత్ వెళ్లి కాలేజిలో చేరాడు. రోజులు గడుస్తున్నయి. మొదటి సంవత్సరంలో ర్యాగింగ్ చేసారు. ఫ్రెండు రమేష్ దానిని తేలికగా తీసుకో మన మధ్య దూరం పోగొట్టి స్నేహం గట్టి పడుతుందని చెప్పాడు. ర్యాగింగ్‌లో కుమార్ చేతికి ఇంజెక్షన్ చేసారు. అది మత్తు పదార్థమని తెలియని కుమార్ ముందు గాబర పడ్డాడు. తర్వాత ఎక్కడికో వెళ్తున్న ఫీలింగు. అలా అలవాటయింది. హెరాయిన్ మెల్లగా కోకెన్ అలవాటు చేసారు. కుమార్ మెల్లగా సెకండు ఇయర్‌కు వచ్చాడు.

రాజారావు సుధలు కుమారును రమ్మని ఎన్ని ఫోన్‌లు చేసినా రాలేదు. ఎక్కడ తాను చెడిపోతున్నాడని తెలిస్తుందని మెల్లగా ఇంటి ధ్యాస నుండి పూర్తిగా డైవర్టు అయ్యాడు. డబ్బులు పంపమని వ్రాసేవాడు కాదు. ఫోన్‌లు చేసేవాడు

> కుమార్ మాఫీయా గ్యాంగు చేతుల్లో పూర్తిగా ఇరుక్కుపోయాడు. చదువు మీద శ్రద్ధ తగ్గింది. ఎప్పుడు ఏదో ఆలోచనలు ఇంజెక్షన్ చేసుకోవడం. కుమార్‌ను పావులాగ వాడుకొన్నారు. మత్తు పదార్థాలు ఇచ్చి ప్రక్కనున్న కాలేజీలకు, బొంబాయి సముద్రం ఒడ్డును అమ్ముకు రమ్మని పంపేవాళ్లు. ఎక్కడ పారిపోతాడో పోలీసులకు ఇన్‌ఫర్‌మేషన్ ఎక్కడ చెప్తుతాడోనని ఇద్దరు రౌడీలను కాపల పెట్టారుకూడను.

కాదు. రాజారావు సుధలు బెంగ పెట్టుకున్నారు. పండగకి ఓసారి వచ్చి వెళ్లమని ఫోన్‌లు చేసారు.

"ఆ చూస్తాను పరీక్షలు అని చాటేసాడు. కాని వెళ్లలేదు.

కుమార్ మాఫీయా గ్యాంగు చేతుల్లో పూర్తిగా ఇరుక్కుపోయాడు. చదువు మీద శ్రద్ధ తగ్గింది. ఎప్పుడు ఏదో ఆలోచనలు ఇంజెక్షన్ చేసుకోవడం. కుమార్‌ను పావులాగ వాడుకొన్నారు. మత్తు పదార్థాలు ఇచ్చి ప్రక్కనున్న కాలేజీలకు, బొంబాయి సముద్రం ఒడ్డును అమ్ముకు రమ్మని పంపేవాళ్లు. ఎక్కడ పారిపోతాడో పోలీసులకు ఇన్‌ఫర్‌మేషన్ ఎక్కడ చెప్తుతాడోనని ఇద్దరు రౌడీలను కాపల పెట్టారుకూడను.



మనస్సు తాను తప్పు చేస్తున్నావు అని పదే పదే హెచ్చరికలు చేస్తున్నది. తాను వచ్చిన పని గుర్తుకు వచ్చినప్పుడల్లా మారాలనీ అనుకునేవాడు. రెండు రోజులు సక్రమంగా ఉంటే మూడోరోజు మళ్లి మామూలే.

"మధర్ సీరియస్ స్టార్ట్ ఇమిడియట్‌లీ" అన్న టెలిగ్రాం చూసి ఏడ్చాడు. అమ్మనాన్నలను ఎంత బాధ పెట్టాను అని. కాలేజి ప్రిన్సిపాల్ చెప్పాడు. రమేష్ ద్వారా గ్యాంగు లీడర్ సురేష్‌ను సమాచారం అందుకొని నీవు వెళ్లితే నిన్ను వదలం చంపుతామని బెదిరింపు వచ్చింది. అయినా తప్పదని బయలుదేరాడు హైదరాబాద్‌కు. మూడోరోజు హైదరాబాద్ సికింద్రాబాదులో అడు గుపెట్టి ఆటోలో ఇంటికి చేరాడు. అప్ప టికే సుధ పరిస్థితి చాలా సీరియస్‌గా ఉంది.

"అమ్మ ఎలా వుంది అని అడిగాడు. ఆప్యాయంగా"

"ఆ" అంది అంతే కాని మాట్లాడ లేక పోయింది. డాక్టరు వచ్చాడు. ఇంజెక్షన్ చేసాడు. పరిస్థితి ఏమిటని అడిగాడు కుమార్. "దిగులు పడ్తూ భోజనం చేయక పోవడమే ఈ పరిస్థితికి కారణం చూద్దాం ఇప్పుడే ఏం చెప్పలేం అన్నాడు.

రాజారావు మాత్రం కుమార్‌ని తదేకంగా చూస్తున్నాడు.

కుమార్ ఎంత మారిపోయాడు తన గుండెల మీద ఆడుకున్న కుమారేనా! అని ఆశ్చర్యపోయాడు. గడ్డం కొద్దిగా పెరిగింది. జుట్టు బాగా పెరిగింది. అవకాశం లేక చేయించుకోలేదేమో అనుకున్నారు.

బంధువులు ఒక్కొక్కరే వస్తున్నారు పలుకరిస్తున్నారు. కుమార్ ఇంట్లో ఉన్నాడే కాని తన కోసం ఎవరన్న వచ్చారా ఏమిటా ఆరాటంగా గుమ్మం వంక చూడసాగాడు. చెల్లెలు సుష్మితా చిన్న చెల్లెలు సుప్రజా వచ్చారు. "అన్నయ్య ఏమిటిలా బాదగా ఉన్నావు" అంటూ

> కుమార్ వెళ్లి రెండురోజుల యింది. ఎక్కడ వుంది ఏం చేస్తున్నది ఫోన్ లేకపోయేసరికి గాబరా పుట్టింది రాజారావుకు. మూడోరోజు ఉదయం 6గం॥లకు ఫోన్ వచ్చింది. పోలీస్‌స్టే షన్ ట్యాంక్‌బండ్ నుంచి ట్యాంక్ బండ్‌లో కుమార్ శవమై తేలాడని అతని జేబులో మీ ఫోన్ నెంబర్ ఉందని పోలీసులు చెప్పారు. ఒక్కసారి గా భిన్నుడై ఏం చేయాలో తోచలేదు రాజారావుకు.

"ఏం లేదమ్మా అని సర్ది చెప్పాలనే ప్రయత్నం చేసారు కాని తండ్రి చూపుల్లోని ఆవేదన దిగులు భయం కనిపెట్టాడు. తన పరిస్థితి ఎలా చెప్పాలో తెలియక తికమక పడ్తున్నాడు. అంతలో కన్పించారు భారీ స్థూలకాయులు. ఎవరిదో ఇల్లు వెతుకుతు జులపాల జుట్టు చేతితో ఏవో చిన్న ఆయుధాలు కన్పిస్తే చంపేద్దామనే ఆవేశం అని కలగొలుపుకున్నాయి.

లాభం లేదనుకొని కుమార్ చెల్లెళ్లను ప్రక్క గదిలోకి తీసుకెళ్లి "అమ్మా నన్ను వాల్లు చంపడానికి వచ్చారు. నన్ను చంపేవిషయం అమ్మ నాన్నలకు చెప్పకండి. వాళ్లు తట్టుకోలేదు. అంటూ జరిగినదంతా చెప్పాడు.

నాటి తరం వారి కథలు నేటి తరానికి

**కథల వంతెన**

టకటక శబ్దం తలుపు మీద కుమారుకు అనుమానం వచ్చింది. ఇక తాను చావక తప్పదని భయపడ్డాడు. వెళ్లి తలుపు తీసాడు.

"బాబు వాళ్లెవరో నీకోసం వచ్చారట" అన్నాడు రాజారావు.

"రాజారీవు ఇక్కడికి కూడా" అంటూ గొణుక్కున్నాడు.

బయటకు వెళ్లాడు కుమార్ వెళ్లెముందు నన్ను క్షమించండి. అమ్మా, నాన్న అంటూ ఎందుకన్నాడో అర్థం కాలేదు రాజారావు సుధలకు, కాని అర్థమయి దిగులు పడ్డారు సుప్రజా, సుష్మితలు జరిగే విషయం తెలుసు కాబట్టి.

బయటకు వెళ్లె కొడుకుతో త్వరగా వచ్చేయమని మాత్రం చెప్పగలిగారు. సుధలో కొద్దిగా మార్పు వచ్చింది. ఆకలిగా ఉన్నదని భోజనం చేసింది. కొద్దిగా నిమ్మలం పడ్డాడు గండం గడిచిందని కోలుకోవడానికి రెండు మూడురోజులు పడ్తుంది అని డాక్టరు చెప్పారు.

కుమార్ వెళ్లి రెండురోజుల యింది. ఎక్కడ వుంది ఏం చేస్తున్నది ఫోన్ లేకపోయేసరికి గాబరా పుట్టింది రాజారావుకు. మూడోరోజు ఉదయం 6గం॥లకు ఫోన్ వచ్చింది. పోలీస్‌స్టే షన్ ట్యాంక్‌బండ్ నుంచి ట్యాంక్ బండ్‌లో కుమార్ శవమై తేలాడని అతని జేబులో మీ ఫోన్ నెంబర్ ఉందని పోలీసులు చెప్పారు. ఒక్కసారి గా భిన్నుడై ఏం చేయాలో తోచలేదు రాజారావుకు.

క్యాబ్ మాట్లాడి అందరూ ట్యాంక్ బండ్ దగ్గరకు వెళ్లారు. పోలీస్‌స్టేషన్ వెనక కన్పించిన శవాన్ని చూపించారు. రాజారావుగారి కాంట్రాక్టరు చుట్టు ప్రక్కల వాళ్లు కొంతమంది వచ్చారు. పోస్టు మార్టం చేయకుండా బాడీని అప్పచెప్పారు.

"ఏం జరుగుతున్నదో ఏం జరిగింది కూడా తెలియని స్థితిలోకి వెళ్లిపోయాడు రాజారావు సుధలు.

"ఏం జరిగింది నేను ఎక్కడ వున్నాను. పాపం వాడేంటి క్రింద పడుకున్నాడు బాబూ లేచి మంచం మీద పడుకోరా అసలే ఒళ్లు నొప్పులు ఉన్నాయన్నావు అని పిచ్చిపిచ్చిగా మాట్లాడసాగాడు రాజారావు కుమార్ శవాన్ని చూస్తు.

"ఏమండి ఏంటండి? అలా ఉన్నారు మన కుమార్ అంటూ సొమ్మసిల్లి పోయింది సుధ.

కాసేపటికి తేరుకున్నారు ఇద్దరు. రాజారావు తాను చేసిన తప్పేమిటి ఆలోచించాడు. అదే ఎదిగె కొడుకును దూరంగా ఉంచి చదువుకోమని ఎత్తిడి చేయడం దానికి ప్రతిఫలమే కుమార్ నిర్జీవంగా పడుండటం. పదిరోజులు పోయాక సుష్మిత రాజారావుకు చెప్పింది కుమార్ చెప్పిన విషయం.

*(జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన "ఖమ్మం కథలు" నుండి...)*

## హిరణ్యాక్షుడు

రహదారి ప్రక్క చెట్టు ఒకటి
చెట్టు క్రింద గుడిసె ఉంది
గుడిసెలోన గ్రుడ్డి వాడు
భిక్ష దొరికితె కుక్షినిండు
కుక్క ఒకటి తోడతనికి
ఆ ముసలెడె దానెజుమాని
విశ్వాసం దాని ఊపిరి
మదిలో కలికాల మహిమ
గుడిసె పీకి గుడి కట్టిరి
ప్రవచనాలు ప్రసాదాలు
నవవిధ భక్తికి భరోసాలు
గుడిసెపోయి గ్రుడ్డివాడు
మరిలిపోయి కుక్కతో సహా
తిరిగిరాని లోకాలకు
జాతస్యహిధ్రువో మృత్యుః
అని పలికిరి అనుభవనీయులు
దంత వేదాంత ధోరణిలో
యమభటుల సంగతేమొ?
వచ్చేరు రక్షక భటులు
ఆచరించేరు ప్రభుత్వ లాంఛనాలు
చట్టప్రకారం
బొచ్చె మాత్రం దొర్లిపోయె...

**-సోమయాజుల సుబ్రహ్మణ్య శర్మ**
సెల్: 9346671524



## మాటల యుద్ధం

మాట నోటు కన్నా ఓటు కన్నా విలువైనది
మాట చరిత్రలో బాటలో శాశ్వతంగా
స్వాతంత్ర్య సమరాన్ని నడిపించింది
మాట తూటాలాగా పేలితే గుండెని
గాయం చేసి మనిషినే దహించివేస్తుంది
మాటలతో మనుషుల్ని బురిడీ కొట్టించి
దారి మళ్ళించుతుంది
మాట అదుపు తప్పితే- అవినీతికి ఆజ్యంపోసి
విద్వేషాలు రేపుతుంది
మాట మంచిదైతే- మనసుకు లేపనమవుతుంది!
మాటలు కత్తులు నూరితే- బాకులై దించి
ఫిరంగులై పేలి బాంబులు విసిరినట్లు
విస్ఫోటనాలు సృష్టిస్తుంది.
మాట అక్కసు వెళ్ళగక్కి
ఆవేశం చూపుతుంది.
మాట అగ్నిలా విరజిమ్మి
ఈర్ష్య అసూయలతో
హింసించి హత మారుస్తుంది.
అమృతం లాంటి మాట కూడా
విషం కక్కుతుంది
మాట అమృతాన్ని పంచుతుంది
మాట మంచితనాన్ని పెనవేసుకొంటుంది.
మాటల యుద్ధాన్ని ఓడించాలంటే
మౌనమే శరణ్యమంటుంది.

**- తాటికోల పద్మావతి**
సెల్: 9441753376



## హైకూలు

మబ్బు-నీటిని
మనసు-కన్నీటిని
మోస్తూ ఉంటాయి.

మనుషులకు
కావాలి కూడు-గుడ్డ
ఫోను కూడానా?

సూర్యుడి భాను
చూపుల్ని వలయంగా
పొద్దు తిరుగుడు.

**- బొబ్బిలి జోసెఫ్**
సెల్: 9989261991



## వలసల సలసలలు

వలసల తంత్రంతో
ప్రపంచం నలుమూలలా
భూమార్గం సాగర యానాల ద్వారా
అనైక్యత
అంతర్గత కుమ్ము లాటల నుంచి
సంక్షోభంలో తల ములకలైన అప్పటి
రాజ్యాల్ని వ్యాపారం పేరుతో చొరబడి
క్రమక్రమంగా ఆక్రమించుకొని
వలస దేశాలుగా మార్చుకొని
అంతులేని దోపిడీ పీడనలకు
భాషా సంస్కృతుల విధ్యంసానికి పాల్పడిన ఐరోపా దేశాలే
నేడు తల్లడిల్లుతున్నాయి
వలసల సలపరంతో.......
వరస మారుతుందా?
చరిత్ర పునరావృతం అవుతుందా...

**-డాక్టర్ దామెర రాములు**
9866422494



# దోమ శతకం



-హెచ్.ఆర్.చంద్రం
9493248053

చీమ శతకము రచించితి,
దోమను చినబుచ్చనేల? దొరకొని యిపుడే
'దోమ శతకము'ను వ్రాయుదు
ప్రామాణిక శుద్ధ కందపద్యములందున్!

గతమున దోమలపై విం
శతి పైననె నేను కంద ఛందమ్ముల వ్రా
సితి, పత్రికలో ప్రచురిం
చితి, నిప్పుడు శతక రచన చేకొనియుంటిన్

తెలియనివా రుండరు దో
మల చరితము, నైన నేను మరియొక మా రా
తెలిసిన దానినె పద్య
మ్ములలో వివరించి శతకముగ నందింతున్

శతమానము పూరించిన
శతక మగును, దోమపైన శతపద్యము లే
గతి వ్రాయ సాధ్యమౌ? నిక
ప్రతి పద్యము దేనికదియె భాసిల్లవలెన్!

మకుట రహితముగ శతకము
ప్రకటించెద, గతమునందు వ్రాసితి నిట్లే
మకుట రహితముగ కొన్ని శ
తకముల, లాక్షణిక సమ్మతమ్మే అదియున్

మనుషుల హింసించుటలో
ఘనత వహించినది చాల! కావున దోమన్
గొని కవితావస్తువుగా
వినిపింతును శతకరీతి వివరమ్ములతోన్!

తెలుగు నిఘంటువులందున
కలవేమో గాని, వాడకములో దోమన్
పిలువగ పర్యాయ పద
మ్ములు మచ్చుకు కానరావు ముచ్చటపడినన్

తెలుగున విస్తారముగా
కలగలసిన సంస్కృతమున గలదు 'మశక' మన్
పిలు పొక్కటి దోమకు వ్రా
తలలో, నది వాడకమున తగులుట అరుదే!

అవినాభావముగా మా
నవులకు, దోమలకు నడుమ ననలెత్తుచు బాం
ధవము కొనసాగుచుండెను!
వివరించుట సులభసాధ్య విషయ మ్మౌనా?

నరజాతికి, మశకమునకు
సరవిగ కొనసాగు రక్తసంబంధము! నె
వ్వరు నాపనేర రిప్పటి
వరకు శతాబ్దముల కాల పర్యంతమ్మున్!

తెలుగు కుటుంబములందున
కల వెన్నో యింటిపేర్లు కడు చిత్రములై;
కల దొకటి 'దోమ' యనియును!
కలుగుట కది యింటిపేరుగా గత మేమో?

భూమిపయి నెల్ల చోటుల
దోమలు కనిపించుచుండు, ధ్రువప్రాంతములున్
దోమలకు నునికిపట్టులె!
సామాన్య మనుట తగదు మశక చరితమ్మున్!

స్థితిగతుల బట్టి దోమల
బతుకులు కొనసాగు; మగవి పది రోజులలో
మృతిజెందు, నాడ దోమలు
బతుకును మరి కొన్నినాళ్లు పరిశీలించన్

దోమను జూచి భయంపడు,
చీమను గాంచినను భయమె! చిత్రమ్మగు, నీ
భూమిపయి జీవు లన్నిటి
లో మృత్యుభయమ్ము మనిషిలోనే హెచ్చౌ!

కల వెన్నో రకముల దో
మలు, మనుషుల కందు మూడు మాత్రమె వ్యాధుల్
కలిగించు నట, కడమ దో
మలు హానికరములు గావు మనుజుల కెపుడున్

పలు జాతులు దోమలలో
కల వనుటే గాని, వాని కనుగొన సామా
న్యులు చాలరు, శాస్త్రజ్ఞులు
కల రట్టివి తేల్చి చెప్పగలుగు సమర్థుల్!

విన చిత్ర మ్మొక దోమయు
కనిపించని దేశ మొకటి కలదట 'ఐస్ ల్యాండ్'
అనునది! ప్రపంచ మెల్లను
ఘనముగ కొనియాడవలయు గాదే దానిన్!

కుట్టు నట ఆడదోమలె,
కుట్టుచు రక్తమును పీల్చుకొనునవి అవియే!
కుట్ట వట మగవి, పొట్టకు
చెట్టు పసరౌ, ఆకు పసరౌ చేకొని బతుకున్

పునరుత్పత్తికి రక్తము
తన కత్యవసరము గాన, తప్పని స్థితిలో
ననె ఆడదోమ జంతువు
లను, మనుజుల గుట్టి పీల్చు రక్తము కడకన్

ఒక సారే బతుకున లైం
గిక కార్యము నాడదోమ నెరపియు, బహ్వం
డకముల సంతానోత్ప
త్తికి నిడి తన జాతి పెంపు దీక్షగ జేయున్

తరచుగ మధుపాయిల నె
త్తురు గ్రోలగ నిష్టపడును దోమలని వచిం
తురు తగు పరిశీలనములు
జరిపిన శాస్త్రజ్ఞు, లది నిజము కాకున్నే?

దూరవు నివాసములలో,
చేరవు జన-జంతు తతుల చెంతకు, గ్రోలన్
గోరవు రక్తము కావున,
దూరమున చరించును మగదోమలు ప్రజకున్

రోగిని కుట్టిన దోమకు
రోగక్రిము లంటుకొనగ, రోగరహితులన్
తా గుట్టి దోమ మరిమరి
రోగము వ్యాపింపజేయు లోకులలోనన్

మనుషులకు వలెనె దోమల
కును లేవో వ్యాధు లంటుకొనునవి? ప్రబలున్
అనుదినము మురికిగుంటల!
మనుషుల కా మురికి నీరు మరణసదృశమౌ!

కంటి కగపడుచు వ్యాధుల
నంటించును దోమ, కాని, అగపడకుండన్
అంటించు రోగముల పె
క్కింటిని సూక్ష్మాతిసూక్ష్మ క్రిము లెన్నేనిన్!

తమ జాతి పెంపుకై ర
క్తము గ్రోలగవలసె దోమ, కసితో గాదే!
తమ ఆరోగ్యపు 'పూచీ'
తమదే యని ప్రజలు మరవదగ దేనాడున్!

తన జీవనశైలికి అను
గుణముగ వర్తించు దోమ; కోపము, వైర
మ్మనునవి దోమ యెరుంగదు;
మనిషే శత్రువుగ దాని మరిమరి యెంచున్

కుట్టును, కుట్టకపోవును;
కట్టెదురుగ దోమజాతి కనిపించినచో
కొట్టక మానదు మనుజుడు
కట్టిడి శత్రువుగ నెంచుగావున దానిన్!

కుట్టుట దోమకు నైజము,
కుట్టిన, బాధితుడు దాని(చాచి)కొట్టుట సహజం;
బ ట్టగుట, దోమ కుట్టుట,
కొట్టుట బాధితుడు మానుకొనలేని విధుల్

అలసి, నిదురించు మనిషిని
కులాసగా దోమ ఒకటి కుట్టిన యెడలన్
అలుగడె నిద్రాభంగము
కలిగిన మానవుడు మశక కాంతామణిపై?

కుట్టి విసికించు దోమను
కొట్టక, లాలించి మెచ్చుకొన దెవ్వండున్!
కొట్టక వదలిన, మరిమరి
కుట్టు నతని దోమ, వదలుకొన దా శాంతున్!

తన కెవ్వ రెట్టి యిబ్బం
దిని కలిగించిన భరించి, ధృతిసెడి యెవడున్
మనజాల డెల్ల వేళల,
తన కగు ప్రతిచర్య చేయ తలపెట్టు వెసన్

ఒక అల్పకీటకము, దో
మకు మానవు డోడు టెట్లు? మగటిమి ప్రకటిం
చుకొనగ తను బాధించు మ
శకమును గొట్టంగ చేయి సాచును వేగన్

కనరాదు దోమ ప్రస్తా
వన పూర్వపు రచనలందు స్వల్పముగా నై
నను, ప్రాసంగికముగ నై
నను! తెలియదు దీని కారణ మ్మేమౌనో?

పూర్వులు దోమ నెరుంగరొ?
అర్వాచీనులను నైన ఆకర్షింపన్
నేర్వదొ? ప్రస్తావించరు
సర్వులు గుర్తించ దగిన సామాన్య క్రిమిన్!

అల్పప్రాణుల పైన అ
నల్ప కవిత్వము రచించి రాధునిక కవుల్!
స్వల్పముగ నైన కవితా
కల్పన మీ దోమ పైన కనిపించ దయో!

ప్రేమగ ఆహారమ్మును
చీమల కిడువారు గలరు; చీమల వలనన్
తా మెట్టి లబ్ధి పొందిరొ?
దోమ పరిగణించబడును దోషిగ నెపుడున్!

చీమకు గల ప్రాధాన్యము
దోమకు కనిపించ దెందు; దోష మ్మెదియున్
దోమ చరితమున కనరా
దే! మరి ఈ పక్షపాత మేల కలిగెనో?

ఏదేని సుంత లాభము
ఈ దోమల వలన నుండెనేని మనుష్యుల్
కా దనక వీని నోర్తురు!
ఏదీ? అటువంటి దొకటి యెదియును లేదే!

దోమలు తమ ఆహారము
తామే సమకూర్చుకొనును తమ పద్ధతిలోన్;
సోమరితనము నెరుంగవు,
తామే రక్తమును పీల్చి తాగును గాదా!

చెప్పవలె దోమ గూరిచి
గొప్పగ ననుకొంటి, నట్టి గుణ మొక్కటియున్
చొప్పడదు దాని బతుకున
చేప్పగ! నితరత్రములనె చెప్పగవలసెన్

దోమల నిర్మూలించగ
సామర్థ్యము మానవులకు చాలకపోయెన్
దోమల జూచి భయంపడు
ఈ మనిషికి చేతగాని వెన్నో యుండెన్!

మనిషి నిరంతర కృషితో
కనుగొనె నెన్నేని సౌఖ్యకర వస్తువులన్,
కనుగొనె దివ్యౌషధములు,
కనుగొన డొక శాశ్వత మశక నివారణమున్!

ఏవేవొ ప్రయత్నమ్ములు
గావించిన గాని మనిషి, కనబడకుండెన్
కావలసినంత ఫలితము!
ఈ విధి దోమలకు జడియు టింకెన్నాళ్లో?

ఇతరత్ర బాధ లున్నను,
శతాబ్దములనాటిదౌ మశక బాధకు శా
శ్వతమౌ నివారణమ్మును
ప్రతి మానవు డహరహమ్ము వాంఛించు గదా!

దోమల తప్పించుకొనగ
ఈ మనుషులు చేయుచుందు రేవేవో, ఆ
దోమలు వీరిని వదలవు!
సేమము చెడినట్టి మనిషి చింతిలుచుండున్!

దోమల శపించి మాపెడి
సామర్థ్యము గల్గినట్టి స్వాములు లేరో?
ఏమేమో చేసెద రట!
ఈమాత్రము చేసి కావ రేలనొ ప్రజలన్?

సామాన్య జనుల వలెనే
స్వాముల రక్తమును దోమ 'స్వాహా' చేయున్
దోమలకు పక్షపాతము,
స్వాముల యెడ భక్తి నాస్తి, స్వార్థమె తెలియున్!

కుట్టినచో మనిషి వదలి
పెట్టడు, అరచేయి చాచి వెంటనె కొట్టున్
కట్టిన దోమ 'హరీ' అను!
కుట్టిన మనిషేల తాను కొట్టక యుండున్?

కుట్టిన కొట్టుట తథ్యము,
కొట్టు టసంకల్పితమ్ము, కునుకుచు నున్నన్
కొట్టక మానదు మనుజుడు,
కుట్టిన ఆ దోమ తప్పుకొను టబ్బురమే!

ఎంతటి శాంతుడును మశక
కాంత తనను పట్టి కుట్టి కారించిన, ని
శ్చింతగ సహించజాలడు,
శాంతము విడనాడి దాని చంపగ జూచున్

దోమ తనమీద వాలిన
స్వామిజీయైన తోలవలె, 'దీవింతున్
దోమా' అని తా నన్నను
దోమ వినదు, స్వామి మేన తొండము గుచ్చున్!

ఆత దహింసావాదియు,
భూతదయాపూర్ణు డైన, పుణ్యుం డైనన్
చేతిపయి కుట్టుచుండిన
ఏతత్ మశకమును గొట్ట కెట్లూరుకొనున్?

మనిషైన, జంతువైనను
తన కనవసరమ్ము, దోమ తాగును రక్త
మ్మును మాత్రము; ప్రాణుల గుణ
గణముల గణనమ్ము వ్యర్థకార్యమె తనకౌ!

అల్పప్రాణియె యైన, అ
నల్ప భయము మనుజజాతి కంతటికిని తా
కల్పించుచుండె మశకము!
స్వల్పముగా దీని నెంచజాలరు జనులున్!

జరుగును పూవుల ఫలదీ
కరణక్రియ తేనియ మశకము గ్రోలుటచేన్
పురుష మశకములు గొను ప
త్ర రసము, పూదేనె తాము బ్రతుకుట కొరకున్

మనిషికి శత్రువులుగ నెం
చిన దోమల నిష్టముగ భుజించెడి ప్రాణుల్
కననౌ; వ్యర్థపదార్థము
కనిపించదు సృష్టిలోన, కడు చిత్రమ్మౌ!

కొలిచిరి గ్రహముల దూరము,
కొలిచిరి సంద్రముల లోతు, కొండల యెత్తుల్
కొలిచిరి గానీ మనుజులు
గెలుచుట కనరాదు మశకకీటక జాతిన్!

నీరు నిలువ యుండినచో
చేరి, త్వరితగతిని వృద్ధిచెందును దోమల్
వీరాధివీరు నైనను
కారించును దోమపడతి, కలవరపెట్టున్!

అరికట్ట వలయు దోమలు
పెరుగు విధానమ్ము ప్రజలు విజ్ఞతతో నె
ల్లరి బాధ్యతగా నెంచుచు
పరస్పరము సహకరించు పద్ధతిలోనన్

కుట్టినచో దోమ దురద
పెట్టును, దద్దుర్లు లేచు, వెంటనె దానిన్
కొట్టిన చచ్చును; తరచుగ
కొట్టక పూర్వమ్మె తప్పుకొని 'తుర్రు'మనున్!

ఏ దోమ సురక్షితమో,
ఏ దోమ ప్రమాదకరమొ? యెవరికి తెలియున్?
ఏ దోమ కుట్టిన నది ప్ర
మాదకరముగానె తలచి మానిసి జడియున్

అల్పమగు రూపు దోమది,
స్వల్ప మ్మది బతుకగలుగు సమయము, గానీ
కల్పించు భయము మాత్ర మ
నల్పమ్మై మనుజతతిని హడలెత్తించున్!

దోమ శరీరావయవములు
సామాన్య విలోకనమున స్పష్టము కావే!
ఏ మనుజులు గన గోరిన
తా మవి కనవలయు సూక్ష్మదర్శిని తోడన్

కనవచ్చు పుస్తకములం
దున సుస్పష్టముగ మనము దోమల బొమ్మల్
మన కంటిచూపు చాలదు
కని ప్రత్యక్షముగ తెలియగా వివరములన్

దోమలు రొద చేయును, మగ
దోమల రొద కన్న ఆడదోమల రొదయే
సామాన్యముగా హెచ్చట!
ఏమౌనో కారణ? మది యెరుగను నేనున్!

రెక్కల చప్పుడె ఝుంకృతి!
అక్కజ, మది విన్న మనిషి అదురున్ బెదరున్
రెక్కల చప్పుడు దోమకు
వెక్కసమై దాని ఉనికి వెల్లడిచేయున్

గుర్తింతురు సజ్జనులను,
గుర్తింతురు ధూర్తజనుల, గుణ-దోషములున్
గుర్తించగలరు పౌరులు!
గుర్తిం పటు గల్గె దోమకున్ మనుషులలోన్!

నాయకుడగు రాముడు, ప్రతి
నాయకుడగు రావణుడును నలుగురిలోనన్
మాయురె! యుగములు గడచిన,
పాయని గుర్తింపు గల్గువారైరి కదా!

కుట్టునవి ఆడదోమలె,
కుట్టవు మగదోమ, లైన కుట్టెడు జాతిన్
పుట్టుటచే రెంటిని జమ
కట్టెద రొకటిగ ప్రమాదకరు లనుచు జనుల్!

ఆడది యిది, మగ దిది యని
తేడాలను దోమలందు తేల్చుట యెట్లౌ?
చూడ నొకేలా గుండును!
తేడా కనరాదు వాని దేహాకృతులన్!

మేధావులె ఈ దోమల
బాధల తప్పించు సుకర పద్ధతు లెవియేన్
సాధించి, భయంకరమౌ
వ్యాధుల నరికట్టి ప్రజల నాదుకొన వలెన్!

జరుగుచునుండె ప్రయత్నము,
లరకొరగా యత్నఫలము లందుచు నుండెన్
చిరు కీటకములు దోమల
నరికట్టుట శాశ్వతముగ అందని పండా?

పురపాలక సంఘమ్ముల
పరువు మురుగు కాల్వలందు పడి మునుగంగా,
మురుగున ప్రబలిన దోమలు
పరాక్రమము చూపుచుండె ప్రజ లందరిపై!

కరవును నిర్మూలించగ
పరిపాలకు లమలుపరచు పథకము లెన్నో
తిరుగబడిపోయి నట్టులె
పురపాలక మశక యత్నములు నీరయ్యెన్!

'డీ డీ టీ' యిదివరలో
వాడబడెను దోమలను నివారించగ, ఈ
నా డది నిష్ఫల మౌటను
వాడుకనకు వచ్చె కొత్త పద్ధతు లెన్నో!

చుట్టలు, బిళ్లలు, బ్యాటులు-
ఇట్టివె మరి యెన్నొ దొరకు నీనా, డైనన్
కుట్టక మానవు దోమలు!
నట్టిల్లే ప్రజకు నేడు నరక మ్మాయెన్!

ప్రత్యక్ష నరక మౌటను,
అత్యావశ్యక మగుట, వ్యయం బనకుండన్
నిత్యము దోమల మందుల
ప్రత్యామ్నాయంబు లేక వాడగ వలసెన్

దోమతెర కట్టుకొంటే
దోమల బెడ దే యొకింతొ తొలగును గానీ,
ఏ మేర సాధ్యపడు నది
సామాన్యుల కిరుకు గదుల సంసారములన్?

దోమతెర కొనుట, వాడుట
సామాన్యుల కెల్లరకును సాధ్యంబౌనా?
దోమలతో సహజీవన
మీ మనుజులు చేయుచుందు రేదో లాగున్!

చీకటి పడితే చా లిక
మూకుమ్మడి దాడిచేసి పోకిరి దోమల్
చీకాకు పరచి, నిద్దుర
లేకుండగ హింసపెట్టు రేయెల్ల ప్రజన్!

నిద్దుర చాలకపోయిన,
పొద్దున మేల్కాంచి పనికి పోవుద మన్నన్
బద్ధకము సాగనీయదు!
నిద్దుర లేనట్టి మనిషి నీరసపడదే!

తినియో,తినకో తమ జీ
వనములు సాగించు పేదవారలు రాత్రుల్
కును కింత తీయకుండిన
పనులకు మరునాడు చనుట భారము కాదా?

దరిజేరి, మేనిపై బడి,
సిరంజి సూదుల హసించు చిరు తొండములన్
చొరజేసి, రక్తపానము
జరిపెడి దోమలకు నరుడు జడువక యున్నే?

కామారి గెలువజాలెడు
భీమబలుం డైన, వాని పితయే యైనన్
దోమల ఝుంకృతి విన్నన్
సామజ ఘీంకార చకిత శశడింభక మౌ!
దోమలకు పేదవాడును
శ్రీమంతుడు నొక్క రూపె! జీవితమందున్
దోమలు కుట్టని మనుజుడు
భూమండలమందు నుండబో డొక్కండున్!

కలవరపెట్టెడు వ్యాధులు
మలేరియా, బోదకాలు మరి యిట్లెన్నో
కలవు మనుజులకు దోమలు
కలుగగ జేసెడివి! రోగకారులు దోమల్!

దోమల మందులు వాడిన
సేమము చెడు జనుల కనుచు చెప్పెదు వైద్యుల్
దోమల ధాటికి భయపడి
తామును నవి వాడుకొనక తప్పకపోయెన్!

ప్రజలకు సేవలు చేయుట
ప్రజాప్రతినిధుల విధి యని పల్కుదురు కదా!
ప్రజ లిట్లు దోమలకు అ
క్కజముగ బలియగుట వారి కన్నుల బడదా?

తమ పరిసరములు పరిశు
భ్రముగా నిడుకొనుట ప్రజల బాధ్యతె యైనన్
సమయోచితమగు సౌక
ర్యముల ప్రభుత్వమ్ము గూర్చదా బాధ్యతమై?

అనుదినము వీధులంబడి
నినాదములు గుప్ప టొకటె నెరవేర్చినచో
పనులు ఫలవంత మగునా?
మన యేలికపెద్ద లింతమాత్ర మెరుగరా?

పదవుల ప్రాణప్రదముగ
పదిలపరచుకొనుట యొకటె పరమార్థముగా
బ్రతుకు ప్రజాప్రతినిధులకు
నెది సాధ్యంబగునొ తెలియ దెవ్వరికైనన్!

ప్రజలను సంరక్షించుట
ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత యైనన్
ప్రజ లడుగరు; పాలకులకు
ప్రజాధనము 'బొక్కు' టొకటె లక్ష్యం బాయెన్!

సంకల్పిత కార్యక్రమ
మంకిత భావమ్ముతోడ నాద్యంతము ని
శ్శంకగ కొనసాగించిన
సంకల్పము సిద్ధినొందు, సత్ఫల మందున్

తన ఆస్తి పెంపు కోసము,
తన వారల మేలు కొరకు తహతహ పడుచున్
ధనకాంక్ష నోలలాడెడు
'ఘననేత'కు లక్ష్యశుద్ధి కరవైపోదా?

దోమల నిర్మూలించగ
సామర్థ్యము నేతల కిటు చాలని దగుటన్
సామాన్యజనులె త్వరపడి
తామై నడుములు బిగించి తలపడవలయున్!

రోగవ్యాప్తికి తరచుగ
ఈగలు కారణము లైన, ఈగ రుధిరమున్
తాగదు, కుట్టదు కావున
ఈగలు దోమలకు తక్కువే యనవచ్చున్!

చీమలును సూక్ష్మజీవులె,
దోమలవలె కుట్టు, నైన దోమకు లొచ్చే!
దోమలు రక్తము తాగును,
చీమల కాలాటి పనులు చేయుట రాదే!

మనుషులను కుట్టి రక్తము
గొను గానీ పేను-నల్లి, గొనకొని రోగా
లను వ్యాప్తిచేయ జాలవు;
కనుకనె నవి దోమకు నెనగా వనవలయున్!

ఎవరికి వారే తమతమ
అవసరములు తీర్చుకొనగ యత్నించవలెన్
ఎవరేని వచ్చి తమవౌ
అవసరముల తీర్తు రనుట అత్యాశ యగున్

మెచ్చదగు గుణం బొక్కటి
మచ్చుకు కనిపించెనేని, మరిమరి దానిన్
హెచ్చించి పొగడి చెప్పగ
వచ్చు, నదియు దోమలందు ప్రశ్నార్థకమే!

'ఈగ' పయి చలనచిత్రము
రాగా తిలకించలేదె ప్రజలెల్లరు? ఆ
లాగే దోమను గూడా
లాగుట తెరపైకి జరుగరాదా? ఏమో!

మేలి గుణ మొక్కటైనను
గాలించిన దోమలోన కనబడకుండెన్
ఏలీల దీని పొగడుట?
చాలింతు విమర్శతోనె శతక రచనమున్

ఇదె ముగిసె దోమ శతకము!
పదుగుర కిది చేరవలయు, పఠితలు దీనిన్
చదివి విషయము గ్రహించిన
పదివే! లిక సెలవు నాకు, స్వస్తి ప్రజలకున్!

## మశకస్తవ పద్య పంచరత్నాలు:

మ మ్మెపుడు నీవు కుట్టకు
మమ్మా! నీ కెపుడు చేతు మభిషేకమ్ముల్
మమ్ముల నీ భక్తుల కను
మమ్మా, కరుణాంతరంగవై మశకమ్మా!

గుడి కట్టకున్న, గుండెను
గుడిగా నొనరించి, నిన్ను కొలుతుము; కొలుపుల్,
ముడుపులు నెడనెడ నుందును!
కడ వరకును మశకజనని కావుము దయతో!

మిన్నంటు విగ్రహమ్ముల
కన్నను మేల్గాదె హృదయ గహ్వరమందున్
నిన్ను ప్రతిష్ఠించుట! అను
కొన్న ప్రతిక్షణము మొక్కుకొన నగు తల్లీ!

నీ పేర సుప్రభాతము,
నీ పేరున దండకమ్ము, నీ స్తోత్రములున్
రూపొందించి పఠింతుము!
కాపాడుము మశకమాంబ కరుణామయివై!

రూపము సూక్ష్మ మ్మైనను
ప్రాపించె విశేష కీర్తి; ప్రజ లెల్లరికిన్
నీ పనితనమ్ము స్పష్టము!
మాపై దయజూపు మశకమాత! నమస్సుల్!!

# చదువులమ్మ ఒడి

విద్యార్థి వయసు ఎంత ఉన్నా..
విద్యాసంవత్సరం మధ్యలో వచ్చినా..
పవేశ పరీక్ష ఊసు లేదు
ఏటేటా కట్టే రుసుముల బాధ లేదు
అంతస్తుల,స్థాయీ బేధాల గోల లేదు
దండనలు,కఠిన శిక్షల జోలికి పోదు!
సర్కారు బడి-చదువులమ్మ ఒడి!
వందలమంది విద్యార్థులున్నా
అవగాహనా స్థాయికి తగిన శిక్షణ
నైతిక విలువలు,క్రమశిక్షణలతో
సమాజానికి రక్షణ!
సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యం
జీవన నైపుణ్యాలను నేర్పించే
ప్రాంగణం!
వసతుల లేమి ఉన్నా..
శిక్షణ పొందిన ఉపాధ్యాయుల
బోధనా నైపుణ్యం మిన్న!
పొంతన లేని
పలు అదనపు 'విధు'లు
పై అధికారులు పెట్టే ఒత్తిడులు
విద్యార్థులతో
అనుబంధాన్ని తెంచే బదిలీలు
ప్రతిరోజూ పంపాల్సిన
పలు రిపోర్టులు,
హాజరు పట్టీలు,
చాంతాడంత లిస్టులు..
తలమునకలయ్యేట్టుగా
వివిధ రకాల విధులతో..
ఒకసారి రక్షకభటునిగా..
మరోసారి ఎన్నికల అధికారిగా..
ఇంకోసారి ఇల్లిల్లూ తిరిగి వివరాలు
సేకరించే సేల్స్ మాన్ గా..
చివరకు బంట్రోతుగా..
ఇలా పలు అవతారాలు దాల్చే
ఉపాధ్యాయులు!
నిరక్షరాస్యులైన తల్లిదండ్రులున్న
పిల్లలకు
అమ్మానాన్నల్లా
ప్రేమను పంచే గురువులు!
విద్యార్థులకు
సుద్దులు చెప్పి మాధ్యమాల
చెడు ప్రభావాన్నుంచి
కాపాడే రక్షకభటులు!.
విద్యార్థులలో దాగున్న ప్రతిభా
నైపుణ్యాలను గుర్తించి..
మట్టిలో మాణిక్యాలను వెలికితీసి
మెరుగుపెట్టు 'ఆల్కెమిస్ట్'లు!.
మట్టిముద్ద వంటి మెదళ్ళను
జ్ఞాన ఉలితో శిల్పంగా తీర్చిదిద్దు
శిల్పులు!
సెలవులు,జీతాలు ఎక్కువ
పనిలేని బడిపంతుళ్లు
పరీక్ష ఫలితాలలో అట్టడుగున
అంటూ ఆక్షేపణలెన్నున్నా..
హేళనలను తట్టుకుంటూ..
పరీక్ష ఫలితాల ఒత్తిడి తప్ప
సౌకర్యాల లేమిని పట్టించుకోని
ప్రభుత్వాలతో..
నెట్టుకొచ్చే సర్కారు బడి!
-సర్కారు బడి-చదువులమ్మ ఒడి!

-చంద్రకళ.దీకొండ
9381361384

# యుద్ధోన్మాదం..!

యుద్ధం అంటే రక్తపుటేర్లు
యుద్ధ గెలుపంటే నెత్తుటికూడు
సమరం అంటే శవాల దిబ్బలు
సంగ్రామమంటే బతులన్నీ చావులే
కదనమంటే మరణ విధ్వంసాలు
పోరాటమంటే భూకంప తీరులు
ఆకాశహర్మ్యాలు క్షణాల్లో నేల మట్టాలు
జనసంద్ర జీవన అలలు కకావికలం!.
త్రేతాయుగంలో స్త్రీ నిమిత్త యుద్ధం
ద్వాపరాన భూమి కోసం కురుక్షేత్రం
కలియుగాన కలహం అకా'రణం'
కమ్ముకున్న గగన యుద్ధమేఘాలు
భూతలాన ట్యాంకులు కవాతులు
సముద్రతలాలపై సబ్‌మెరైన్ల జోరులు!
మహోగ్ర యుద్ధ ఊచకోత ఎడారిలో..
శాంతి సంతోషాలన్నీ ఒయాసిస్సులే
సామూహిక హత్యాకాండ చరిత్రలు
సమర మోహాలు, రుధిర దాహాలు
నలుచెరగులా ఉన్మాద బుద్ధులు
మదం పెనవేసుకున్న కిరాతకాలు
తల్లుల గర్భశోకాలు మిన్నంటే వైచిత్రి
ప్రళయ భీకర యుద్ధ ఘోషలు !
బతుకునిచ్చే, బతకనిచ్చే..
మానవత్వానికి దూరంగా..
చావు దిశగా ఈ చీకటి ప్రస్థానం
ఇంకెంత కాలం, ఎంత భారం
స్త్రీ వృద్ధ శిశువుల్ని చంపడం..
మహాపరాధం నాటి భారతం
నేడు యుద్ధ నీతిని పాతరేయడం
మంచి మాటల నీతి పాఠాలన్నీ..
అయ్యాయి బధిర శంఖారావాలు
రణరంగం కానిచోటు దొరకదు
రక్తం తడిసిన కన్నీటి కదనాలు !
శాంతి అనిత్యం, యుద్ధమే నిత్యం
యుద్ధ బులెట్ శాంతి పావురాన్ని..
పాశవికంగా హత్య చేస్తున్న వేళలు
నెత్తురోడుతున్న నేటి భూతల గడ్డ
శిథిలాల కింది శవాల గుట్టల్లోంచి,
నిరాశ్రయ నిస్సహాయ గొంతుల్లోంచి..
శవాల గుంపుల్లోంచి రోధిస్తున్న..
మానవ చరిత్ర సన్నని స్వరాలు!
యుద్ధోన్మాదానికి గజ 'గాజా'
సమరం శాశ్వతంగా తిష్ట వేస్తే..
శాంతి తొంగి చూసే అతిథి మాత్రమే
రణ క్షేత్రాలన్నీ రక్తంతో మెరిస్తే..
తక్కినవన్నీ కన్నీటితో తడిస్తాయి
యుద్ధంలో ఇరుపక్షాలు విజితులే..
ఓడినోడు సర్వం కోల్పోయి ఏడిస్తే..
గెలిచినోడు చేసేదిలేక రోధించె..
ఇదే కదా డిజిటల్ యుగ యుద్ధనీతి
ఇదే కదా జ్ఞాన ధరిత్రి దీన చరిత్ర !

-మధుపాళీ
9949700037

# నేతలారా!

ప్రజలంటే అమాయకులు కాదోయ్
చెప్పినవన్నీ నమ్మటానికి చెప్పినట్లు తలలూపటానికి
ప్రజలంటే గొర్రెలు కాదోయ్
ఒకేదారిన నడవటానికి గుడ్డిగా ప్రవర్తించటానికి.
ప్రజలంటే అవినీతిపరులు కాదోయ్
డబ్బులు తీసుకోవటానికి ఓట్లు అమ్ముకోవటానికి
ప్రజలంటే పశువులు కాదోయ్
గాటిన కట్టేయటానికి పనులు పురమాయించటానికి.
ప్రజలంటే పోకిరీలు కాదోయ్
గొడవలు చేయటానికి గోతుల్లో తోయటానికి
ప్రజలంటే గాడిదలు కాదోయ్
దెబ్బలు తినటానికి బరువులు మోయటానికి.
ప్రజలంటే తాగుబోతులు కాదోయ్
మద్యానికి బానిసలుకావటానికి సారానిచ్చినవారిని గెలిపించటానికి
ప్రజలంటే తిండిబోతులు కాదోయ్
బిర్యానిపొట్లాలకు లొంగటానికి బటన్లను నొక్కటానికి.
ప్రజలంటే చైతన్యపరులోయ్
నిజాలనుచూడటానికి న్యాయంగామెలగటానికి
ప్రజలంటే సంఘజీవులోయ్
కలసిబ్రతకటానికి పరస్పరంసహాయంచేసుకోవటానికి.
ప్రజలంటే ఓటరుమహాశయులోయ్
అభిమతంతెలియజేయటానికి అభివృద్ధికాముకులనెన్నుకోవటానికి
ప్రజలంటే ప్రజాసామ్యవాదులోయ్
ప్రజలకొరకు ప్రజలచేత ప్రజలేపాలించే
ప్రభుత్వాన్నికోరేవారోయ్

-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630

# సప్తపదులు...!

-గన్నోజుశ్రీనివాసాచార్య
8555899493

యదార్థము
పదార్థము.
మోసాలు
కుతంత్రాలు
లేకుంటేనే
మనస్సు
కృతార్థము!

సుధాముడు
పరంధాముడు
ప్రతిఫలాపేక్షను
ఆశించని మైత్రికి
కుచేలుడే
కదా
సద్గుణధాముడు!

సహవాసం
పరవాసం
పాచికలాట
వ్యసనంతో
పాండవులు
వెళ్ళిరి
వనవాసం!

పాడిపంటలు
వేడివంటలు.
ప్రపంచమానవాళి
పాలిట తీర్చును
సదా
ఆకలిమంటలు!

శ్రీమతి
బహుమతి
కాపురం
మొదలెట్టకా
తీసుకోవాలి
ఆమె
అనుమతి!

అట్టడి
కట్టడి
అవినీతి
రాజ్యమేలితే
తప్పదు
కదా
ముట్టడి!

పొంగిపోకు
లొంగిపోకు.
ఎప్పుడైన
ఎక్కడైన
పొగడ్తలకు
తెగడ్తలకు
కృంగిపోకు!

# ప్రేయసి (కథ)



-లక్ష్మణరావు పతంగే
సెల్:92900 79047

గాయ్న పేరు చంద్రశేఖర్ గాని అందరు సెంద్రయ్య అనే పిలుస్తరు. గా సెంద్రయ్య మన్సు లక్ష్మిమీద పడ్డది. ఎంత గాఢంగ ప్రేమించాడంటే గామె కాదంటే బత్కలేడు. లక్ష్మి ఏమో కుందనపు బొమ్మ. సద్వుకున్నది. సంసారం సక్కదిద్దుకొనే తెల్వి వున్నది. అయినోళ్ళ పిల్ల గసువంటప్పుడు గామెను సేస్కోనీకె ఎవల్లు ముందుకు రారు?

నీలమ్మ గా సెంద్రయ్యను ప్రేమించింది. సెంద్రయ్య గామెకు మ్యానత్త కొడుకాయె. చిన్నప్పట్నుంది సెంద్రయ్యను నీలమ్మ మొగుడు అనేటోళ్ళు. నీలమ్మ అమ్మ నాయ్నలకు కూడ మన్సుల గీళ్ళిద్దరి పెండ్లి సేయాలన్న ఆస ఉండేది. సెంద్రయ్య అందగాడు. ఊంచా పూరాగుంటడు. పట్నంల సద్వీండు. తండ్రి సంపాదన మస్తుగనే ఉన్నది.

నీలమ్మకు తన బావ మీద వల్లమాలిన ప్రేమ. చిన్నప్పట్నుండే బావనే తన భర్త అనే మాట గామె మన్సుల లోతుగ నాటుక పొయ్యింది. గామె పెద్దగయిన్నసంది ఆమె మన్సుల కోర్కెగూడ పెద్దదయ్యింది. మంచిగనే సద్వుకున్నది. సెంద్రయ్యే తన లోకం అనుకున్నది.

అస్సలేమయిందంటే సెంద్రయ్య తన మన్సుల మాటను లక్ష్మి దెగ్గెర మన్సిప్పి ఎన్నడూ సెప్పలే, గాని లక్ష్మి తనకే మనసిస్తది, మనువాడ్తది అనుకున్నడు.

కొన్నొద్దులయినంక నీలమ్మ తండ్రి బాలయ్య సెంద్రయ్య ముంగల తన బిడ్డె పెండ్లి ముచ్చట బెట్టిండు. కాని సెంద్రయ్య ఉల్కలేదు పల్కలేదు. ఖామోష్‌గున్నడు. అటెన్కాల తన తల్లితోని సెప్పిండు తాను నీలను పెండ్లి సేస్కోనని. గామాట ఇనంగానే గామెకు కొట్టినట్లయ్యింది. కొడుకు మాట ముంద్గాల నమ్మలే. నిదానంగ పొయి మల్లోసారి కొడుకును అడిగింది, "ఎందుకు సేస్కోవురా?" అని.

తల్లి గట్ల అడ్గంగనే పరేషానయ్యిండు సెంద్రయ్య. నీలకు ఏ వొంక పెట్టడని. కాని తన ప్రేమ అంటే లచ్చిమి సంగతి చెప్పలేదు. గప్‌చుప్‌న బయటికి పొయ్యిండు. లక్ష్మి ఆమె అర్రలు కూసోని ఏదో పుస్తకం సదువుతున్నది. సెంద్రయ్యను సూసి లేచొచ్చింది. కుర్చీల కూసోబెట్టింది. కూసో గిప్పుడే

నీలమ్మకు తన బావ మీద వల్లమాలిన ప్రేమ. చిన్నప్పట్నుండే బావనే తన భర్త అనే మాట గామె మన్సుల లోతుగ నాటుక పొయ్యింది. గామె పెద్దగయిన్నసంది ఆమె మన్సుల కోర్కెగూడ పెద్దదయ్యింది. మంచిగనే సద్వుకున్నది. సెంద్రయ్యే తన లోకం అనుకున్నది.

వస్తనని సెప్పి లోపల్కి పొయ్యింది. ఒక తస్తరీల మిఠాయి బిల్లలు పెట్టుకొని వొచ్చి "తిను" అన్నది.

మిఠాయి బిల్ల తీస్కొని "తిన్నుంట" ఏంది లక్ష్మీ ఈ రోజు షాన ఖుషీగ కన్పిస్తున్నవు? అన్నడు.

"అయ్యో! నీకు తెల్వదా శేఖర్! మా బావ రేపు అమెరికా నుంచి వొస్తుండు. గాయ్న సదువు అయిపొయ్యిందట."

"అట్లానా! మీ బావ ఒకాయన అమెరికాలున్నడన్న సంగతి నాతోని ఎప్పుడు సెప్ప లేదెందుకు?"

"గా అవసరం రాలేదు గన్క సెప్పలేదు."

గంతల్నే లక్ష్మీ వాళ్ళ నాయ్నొచ్చిండు. రాంగానే "బాగున్నవా" అని పల్కరిచ్చిండు.

గాయ్న మ్యానల్లుడు అమెరికా నుంచి వస్తున్న సంగతి సెప్పిండు.

"గిప్పుడే తెల్సింది. లక్ష్మి చెప్పింది" అన్నడు శేఖర్.

"వొచ్చే నెలల్నే లక్ష్మి పెండ్లి సేయాలనుకుంటున్నం. వాని సదువు కూడ అయిపొయ్యింది. వాండ్లు తొందర పెడ్తున్నరు" అన్నడు.

సెంద్రయ్య పరేషానైపొయ్యిండు. ఇగ ఏం మాట్లాడలే. లక్ష్మి దిక్కు సూసిండు. గామె మొకం నిండా సంతోషమే కన్పించింది. సెంద్రయ్యకు గుండెల్ల గడ్డపార దిగినట్లయ్యింది. నోట్లకెల్లి మాటలు రాలే. అనలేక అనలేక 'అవును మంచిగనే ఉంటది' అని కూసోలేక 'పనున్నదని" సెప్పి బయటికొచ్చిండు.

ఇంటికి పోనీకే మనసొప్పలే. చెమన్‌కు పొయ్యిండు. మనుసుల మనుసు రోజులు లక్ష్మి నాతోని ఇంత దగ్గరగా ఉండి మాట్లాతుంటే తనను ప్రేమిస్తున్నదనుకున్నడు. లక్ష్మి మీద కోపమొచ్చింది.

ఇంటికి పోనీకే మనసొప్పలే. చెమన్‌కు పొయ్యిండు. మనుసుల మనుసు లేకుంటయ్యింది. ఇన్ని రోజులు లక్ష్మి నాతోని ఇంత దగ్గరగా ఉండి మాట్లాతుంటే తనను ప్రేమిస్తున్నదనుకున్నడు. లక్ష్మి మీద కోపమొచ్చింది.

అయిన సంబాలించు కున్నడు. తప్పంతా తనదే అని తెల్సుకున్నడు. తన ప్రేమను ఇన్నొద్దులు గామెతో సెప్పకపొవ్వడం తన తెల్విలేనితనం అనుకున్నడు. లక్ష్మితోని దోస్తి కాకముందు తాను కూడ నీలను మనుసుల ప్రేమించిండు. ఇప్పుడు నీలను తానొద్దంటే గామె గతేమైతది. లక్ష్మి సంగతి తెలిసి తాను బాధ పడ్తున్నట్లనే నీల కూడా బాధపడ్తది. తనకు లక్ష్మి మీద కొపమొచ్చినట్లనే నీలకు కూడా తన మీద కోపం రాకపోదు అన్కున్నడు. అయినగాని నీలను తాను ఎందుకు వద్దనుకుంటున్నడో తనకే తెల్వదాయె. నీల లక్ష్మికంటే దేంట్ల తీసిపొయ్యిందని. లక్ష్మి మీద కోపం నీలమీద ప్రేమను పెంచింది. ఎంటనే ఇంటిమొకం పట్టిండు.

ఇంటికాడనేమో తల్లి శేఖర్ సంగతి పెనిమిటికి చెప్పింది. గాయ్నకు కొడ్కు మీద కోపమొచ్చింది. అగ్గిమీద గుగ్గిలం అయ్యిండు. వాడురాని వాని సంగతేందో సూస్త అన్నడు. కొడ్కు రాక కోసం ఎదురు సూడబట్టిండు.

సెంద్రయ్య గడపల అడ్గుపెట్టిండో లేదో, "ఏంరా! నీలమ్మను పెండ్లి సేస్కోనన్నవంట అమ్మతోని. నిజమేనా?"

"గదేం లేదు నాయ్న! అమ్మ ఏమంటదో సూద్దమని గట్లన్న. నేనేమన్న సేస్కోనన్ననా ఏంది?"

గాయ్న మాటలినంగనే మొగుడు పెళ్ళాల మన్సు సల్లబడ్డది. ఒకల్ల మొకాలొకల్లు సూస్కోని నవ్వుకున్నరు.

పెండ్లి మూర్తాలు పెట్టుకున్నరు. నీల పెండ్లి పత్రిక లక్ష్మి ఇంటికి, లక్ష్మి పెండ్లి పత్రిక నీల యింటికి చేరినై. ఒకే మూర్తానికి యిద్దరి పెండ్లిండ్లు జరిగిపోయినై.



తాళ్ళపల్లి మురళీధరగౌడు "గేయ మౌక్తికాలు" కవితా సంపుటికి కవి. ఃసాహితీవేత్త సుదామగారు రాసిన ముందు మాట.

# తాత్త్విక గేయ కవితా సుమవల్లి తాళ్ళపల్లి

శిరీష కుసుమ పేశల సుమనస్కుడు సదా యువమిత్రుడు
మా తాళ్ళపల్లి మురళీధరగౌడు

**'పుస్తకశిల్పి'**గా ఖ్యాతిగాంచి, రాష్ట్రప్రభుత్వ సత్కారాన్ని సైతం అందుకున్న కవిమిత్రుడు మురళీధర్- 'కుసుమశ్రీ' అన్న పేరుతో గేయమౌక్తికాలు రాస్తూ వచ్చిన కౌమారదశనుండి పరిచితుడు అని చెప్పుకోవడం ఆనంద సుధాయకం. 1960 దశకంలో 'యువమిత్ర' లిఖిత మాసపత్రిక నెలకొల్పి మీ సుధామ నిర్వహిస్తున్న కాలం లో- తన మౌక్తికాలతో ఈ **'కుసుమశ్రీ'** ప్రాచుర్యం సంతరించిన ప్రాజ్ఞుడు.

జంటనగరాల సాహితీ సాంస్కృతిక సంస్థగా నాడు గణుతికెక్కిన **'యువభారతి'** సంస్థ వైభవ ప్రాభవాలకు కృషి సల్పిన క్రియాశీలక సభ్యులం మేము. యువభారతి ప్రచురణలకు ఆయా ముద్రణాలయాలలో గ్యాలీ ప్రూఫ్ నుండి మిషన్ ప్రూఫ్‌వరకూ ప్రూఫ్‌రీడింగ్ చేస్తూ, అచ్చుతప్పుల పట్టిక అవసరం లేని విధంగా అక్షర దోషరహితంగా ఆ గ్రంథాలు వెలువడడం వెనుక పనిచేసిన శ్రమజీవులలో తానొకడు. పుస్తకరూప శిల్పిగా వందలాది గ్రంథాలు తన ఆధ్వర్యంలోనే వెలుగుచూడాలని నేడు అనేక మంది రచయితలు, రచయిత్రులు, సృజనకారులు అభిలషిస్తున్న దానికి బీజావాపనం-ఆనాడే జరిగిందనవచ్చు.

వానమామలై వరదాచార్యులు వంటి కవిపండితుల శిష్య వాత్సల్యాన్ని అందుకున్న అదృష్టశాలి మా మురళీధరగౌడ్. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తొలి దాశరథి సాహిత్య పురస్కారాన్ని అందుకున్న సాహితీ సుధానిధి, తెలుగు రుబాయీ కవిసమ్రాట్ శ్రీ తిరుమల శ్రీనివాసాచార్య గారికి నేటికీ అనుంగు శిష్య మిత్రునిగా ఆయన సాహిత్య వరివస్యను గ్రంథాలుగా వెలువరించడంలో మురళీధర్ కృషి అసామాన్యం. అనేకమంది రచయిత్రుల నవల, కథా సంకలనాలు, కవుల కవిత్వ సంపుటాలు అందంగా ఆహ్లాదకరంగా ముద్రితమవడానికి బాధ్యత వహించి ప్రచురణ రంగాన మెప్పులు పొందుతున్న పుస్తక రూపశిల్పిగా గొప్ప కృషీవలుడతను.

వృత్తిరీత్యా రవాణారంగాలకు చెందినవాడే అయినా- తన చేతుల మీదుగా ఎందరి సాహిత్యాన్నో పాఠకులకు తానొక వాహికగా చేరవేస్తున్నవాడు! వృత్తిరీత్యా ఢిల్లీలో పని చేస్తున్న రోజుల్లో- 'ఢిల్లీ తెలుగు వాణి' మాసపత్రికకు వెన్నుదన్నుగా వుండి, ఢిల్లీ సాంస్కృతిక సాహిత్య రంగంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న ప్రతిభామతి. తెలుగు రాష్ట్రం నుండి ఏ సాహితీ ప్రియభావుకుడు ఢిల్లీ వెళ్ళినా, మురళీధర్ అదించిన సేవకు మురియకుండా లేరు! ఎందరో ప్రముఖులను ఇంటర్వ్యూలు చేసి వాటికి గ్రంథరూపం ఇచ్చాడు.

తాను ఎంత కార్యకర్తయో, అంత కావ్యకర్త కూడాను! కౌమారదశలోనే 'మౌక్తికాలు' గేయరూప కవితలుగా వెలువరిస్తూ- ఒక తాత్త్విక ఫణితిని ఆనాటికే అందుకున్న విమలమతి. తన కలం పేరు 'కుసుమశ్రీ'కి తగినట్లుగానే తనది పూవులాంటి మనస్సు, స్నేహమకరందం పంచే హృదయ రోచిస్సు. ఇంతవరకూ **'వెలుగురేఖలు', 'ప్రశ్నార్థకాలు' కావ్య సంపుటాలు, 'జీవనరేఖలు'** ఇంటర్వ్యూలు గ్రంథ రూపంలో వెలువరించడమే కాక, 'కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సాహిత్య చరిత్ర'ను రచించాడు. **'ఇలా ఎందుకు?'** అను అనుసృజన గ్రంథం వెలయించాడు. 'ఫ్రెష్ సిగ్నేచర్స్' పేర తన కవిత ఆంగ్లంలోనికి, అలాగే హిందీలో కూడా **'ఇతిహాస్ కే ఖండ్ హరోమే'** పేర- రెండు కవితా సంపుటాలు అనువాదమై ప్రచురితమయ్యాయి.




ప్రతులకు: తాళ్ళపల్లి మురళీధర్ గౌడ్, 37/202, రాంమోహన్ టవర్స్, హుడా కాంప్లెక్స్, సరూర్‌నగర్, హైదరాబాద్-500 035
సెల్: 9393 176 552

వృత్తిరీత్యా రవాణారంగాలకు చెందినవాడే అయినా- తన చేతుల మీదుగా ఎందరి సాహిత్యాన్నో పాఠకులకు తానొక వాహికగా చేరవేస్తున్నవాడు!

ఎందరికో ఆత్మీయుడు కనుకనే శ్రీవేముల ప్రభాకర్, డా॥ అందె వేంకటరాజం, డా॥ గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి, చెఱుకు సత్యనారాయణరెడ్డి, డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య, శ్రీ తుమ్మూరి రాంమోహన్‌రావ్ వంటి కవిశ్రేష్ఠులు తమ గ్రంథాలను మురళీధరగౌడ్‌కు అంకితం చేశారు.

అక్టోబర్ 7, 1953లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెన్నూరు తాలూకా మెట్‌పల్లి గ్రామంలో కీ.శే.సూర్యాబాయి, సాంబాగౌడుల గర్భశుక్తి ముక్తాఫలంగా జన్మించిన మురళీధర్ బి.కాం. పట్టభద్రుడై, ట్రాన్స్‌ఫోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఉద్యోగిగా పనిచేస్తూ-2001లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి, అనంతరం ఆంధ్రప్రభలో, ఆంధ్రమహిళాసభలో తన సేవలందించారు. ఆపై పుస్తక ప్రచురణ రంగంలో ప్రవేశించి గత పదిహేనేళ్ళుగా-ఆరువందల పైచిలుకు పుస్తకాల ప్రచురణలకు 'పుస్తక రూపశిల్పి'గా ప్రసిద్ధికెక్కారు. ఢిల్లీలో పనిచేసిన కాలంలో **'ఆంధ్రా అసోసియేషన్'**లో ఆయన క్రియాశీల సభ్యునిగా అందించిన సేవలు ప్రశంసార్హమయ్యాయి.

వానమామలై వరదాచార్య స్మారక సాహితీ పురస్కారం, జీవన సాఫల్య పురస్కారం, శతజయంతి పురస్కారం, డా॥సామల సదాశివ సాహితీ పురస్కారం, డా॥ ద్వానా. శాస్త్రి సాహితీ పురస్కారం, డా॥రావి కంటి వసునందన్ ప్రతిభా పురస్కారం, డా॥ తిరుమల శ్రీనివాసాచార్య ధర్మనిధి పురస్కారం, కొమురంభీం ఆసిఫాబాద్‌జిల్లా నుండి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ విశిష్ట పురస్కారం వంటి పురస్కారాలందుకున్న మురళీధర గౌడు- సాహితీ స్వర్ణోత్సవం 2018లో జరిగినప్పుడు, లక్ష రూపాయల నగదు బహూకరణతో సన్మానితుడవడం- అర్హతకు లభించిన పురస్కృతి!

శ్రీ మురళీధరగౌడు గారి శ్రీమతి అరుంధతి, కుమార్తెలు కవిత, మహతి. అలాగే అల్లుళ్ళు శ్రీనివాస్, కిషన్, చక్కని కుటుంబ వాతావరణంలో, మనుమరాలు మేఘన, మనుమడు అద్వీక్‌ల కూరిమి అనురాగంతో- సాహితీ జీవనం, కుటుంబ జీవనం ఫలప్రదంగా సాగిస్తున్న తాను, తన రచనలన్నింటినీ కూడా గ్రంథస్థం చేయవలసిన ఆవశ్యకత ఎంతయినా వుంది!

తన **'మౌక్తికాలు'** గ్రంథరూపేణా వెలువడాలన్న అభిలాష ఈ నాటిది కాదు. తాను యువకునిగా ఆ రచనలు చేస్తున్న నాటినుంచీ వున్నదే. ఇటీవల తెలుగు విశ్వవిద్యాలయం వారు గ్రంథ ప్రచురణలకు రచయితలకు ఆర్థిక సహకారం అందించేందుకు ఏటా ఏర్పరిచే నిర్ణాయక కమిటీలో సభ్యునిగా వెళ్ళే అవకాశం లభించినపుడు- ఈ **'గేయ మౌక్తికాలు'** దర్శన మివ్వడం ఆనంద సంధాయకమైంది.

సుమారు యాభై కవితల ఈ సంపుటి తాళ్ళపల్లి మురళీధరగౌడ్ కవితాత్మకు ఒక నికషోపల. **'తల్లీ నిన్ను దలంచి'** అని ఆ వాణిని స్మరించి- తాను వెదజల్లిన ఈ కిరణాలు గేయరచనపై తనకు గల మక్కువకూ, రచనాభినివేశానికీ దర్పణాలు. ఉగాది, దీపావళి వంటి పర్వాల వేళ ప్రతిస్పందించినా, గాంధీ, రాధా కృష్ణన్, శాస్త్రి వంటి జాతి నేతలను కీర్తించినా, వరదాచార్యులు, సినారె వంటి సాహితీమూర్తులను సంస్మరించినా- ఇతివృత్తం ఏదయినా తన గేయపు నడక రాయంచలా సాగుతుంది.

ముఖ్యంగా మురళీధరగౌడులోని జీవన తాత్త్వికత, మానవీయ విలువల ఆరాటం ఎన్నదగినవి. పఠితల హృదయాలను రసప్లావితం చేసే గుణం తనది.

**జీవిత ముకురము లోపల
నన్ను నేనె చూసుకొందు
ఆత్మ యనెడి కావ్యంలో
నన్ను గూర్చి వ్రాసుకొందు
అనే ఈ కవి-
కలము పాళి లోపల నే
కరిగింతును అనుభూతులు
కవియను శబ్దమ్మునందు
కొనగ నేను కృషి జేతును**

అంటూ- తన దారికి అడ్డురావద్దనీ, రాజకీయ గంధాన్ని తనకు పూయబోకండనీ వినతి చేస్తూ **"నీవేదో అనెదవంచు-నా ఆత్మను చంపుకో; అంతరాత్మ అందించెడి-భావములే నుడువగలను"** అని విమర్శకతీతంగా తన **ఆత్మధృతిని అభివ్యక్తీకరిస్తాడు.**

**నీతికి పందిళ్ళు వేసి
జాతికి జీవమ్ము పోసి
సత్యానికి, ధర్మానికి
కళ్యాణము చేయుదమిట**

అంటూ తన కవిత్వ ఆశయాన్ని సుస్పష్టం చేస్తాడు. అందుకోసమే-

**వర్తమాన మందు నుండి
గతకాలము సమీక్షింతు;
విజ్ఞానపు దర్పణమున
భవిష్యత్తు విలోకింతు**

అని తన గమ్యాన్నీ, గమనాన్నీ సూచిస్తాడు. మురళీధరగౌడులో ప్రణయోన్మీలనం, దేశభక్తి, ప్రకృతిపై అనురక్తి, దైవభక్తి-నాలుగు స్తంభాలుగా అతని కవిత్వ భవనం తాత్త్విక పునాదులపై నిర్మితమౌతోంది.

**సౌందర్య మధువు నీ ముఖ
సరసీజమ్మున దాగెను;
అందుకె నా హృదయమధుప
మదిగ్రోలుచు చెలరేగెను
అని ప్రణయోన్మీలనం చూపినా-
జనస్వామ్యం వెలిగించిన
జ్యోతి ఆరిపోనట్టిది;
విప్లవమ్ము-ఇది గెల్చును
విజయము తథ్యమ్మిది**

అని దేశభక్తి శంఖం పూరించినా-

**కురిసేను తొలివాన
విరిసేను హరివిల్లు
కదుమోదమున పుడిమి
ఒడలు పులకించేను
అని ప్రకృతి పరవశం చూపినా-
ఎవడనేను; ఈ జీవిత
పరమావధి యేమిటోయి?
వచ్చితి నేనెచట నుండి
నిర్గమింతు నేనెచటకు?-**

అని ఆత్మపరిశీలనం చేసుకుంటూ-

**ప్రభూ! నే నెవరినొ తెల్పుము
గమ్యమేదొ సూచింపుము
నన్ను గూర్చి పాడలేను
నిన్ను గూర్చి పాడుకొందు**

అని ఒక సకలాతీత శక్తి ముందు వినమ్రుడయినా- ఒక 'యుగకాంతి'కి 'నేను సైతం' **'కాంతిరేఖ'** అన్న చందాన. **'నవ్వుల దివ్వెలు'** వెలిగిస్తూ **'వేదన' 'నివేదన'** కూడా - **'మృణ్మయపాత్ర'**లో- **'రక్తదీపాలు'**గా 'ప్రగతి యనని నిదియేనా?' అనే 'నిరాశ' విడనాడి, **'శాంతిదూత'** వలె 'బీదపిల్ల'పై సైతం **'ఏది అనురాగం?'** అనే 'నిరీక్షణ' లేకుండా, సదా 'కొత్తగీతి'ని 'తెలుగు వైభవం'తో **'నిన్ను గూర్చి పాడుకొందు'** నంటూ- **'జీవిత సంకేతం', 'అమృత వర్షిణి'**గా **'సేతువు'** కట్టే **'మహామనీషి'** ఈ కవిమిత్రుడు.

తన 'ఇరవై ఒకటో యేట' 'స్వప్నరేఖ'ను- ఆనాటి నుంచీ పోగు చేసిన 'మౌక్తికాలు'నూ, నేడు ఇలా 'గేయ మౌక్తికాలు'కవితా సంపుటిగా పఠితృలోకానికి ఉపాయనం చేస్తున్నందుకు మనసారా అభినందిస్తూ ఈ సంపుటి ఒక 'గంధకుటి'గా భాసిల్లాలనీ

**నా తమ్ముల పరిపూర్ణుల
జేయువరకు నిదురబోను
నా హృదయపు సంగీతము
నా జీవిత సంకేతము**

అన్న తన ఉదాత్త భావన సువ్యవస్థీకృతం కావాలనీ ఆకాంక్షిస్తూ కాగలరని విశ్వసిస్తూ, చిరకాల ప్రియ కవిమిత్రునికి మనసా శుభాకాంక్షలతో.. సదా మీ



**-సుధామ**
9849297958



సత్యచాగంటి "రంగులద్దని కుంచెలు" కవితా సంపుటికి శాంతికృష్ణ రాసిన ముందు మాట..)

# రంగులు పూయని కుంచెలు

మన ఆలోచనలకు ఎంతో కొంత భావుకత్వము, కొంచెం ఇమేజినేషన్ జోడించి అక్షర రూపం ఇచ్చి ఓ కవిత గానో, ఓ కథగానో మలచి నప్పుడు వాస్తవం కొంత మరుగునపడినా, కొంచెం ఆకర్షణీయత జోడించి అవుతుంది అనేది సత్యమే.

మరి ఏ రంగులు హంగులు వద్దని, ఉన్నది ఉన్నట్లు రాసినప్పుడు రంగులు అద్దే కుంచెలకు పని ఏముంటుంది? మనం ఏ రంగులు అద్దకున్నా దృశ్యం వర్ణమయంగా కనిపించడం చూసి అవి కూడా అచ్చెరువొందుతాయి.

రంగులద్దని కుంచెలు సత్య చాగంటి కవితలు. అన్నీ కలిసి ఓ చోట సంపుటమై చేయబోయే గారడీలు.

దాదాపుగా ఐదు సంవత్సరాల నుంచి పరిచయమైన వ్యక్తి. మా తెలుగు సాహితీ వనంలో స్థిరంగా ఉన్న కవులు రచయితల్లో తనకు ప్రత్యేక స్థానం ఉంది. కవితలు, సమీక్షలు రాస్తున్న రచయిత్రి.

కాకినాడలో ఉంటారు ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తారు. ఎన్నో అంశాలపై అలవోకగా కవిత్వాన్ని అల్లగల ప్రతిభావంతురాలు.

కొంచెం స్త్రీ పక్షపాతి, మహిళల కష్టాలు, నష్టాలు, త్యాగాలు, కన్నీళ్లు, ఉద్వేగాలు, ఆనందాలు అన్నిటిని కవిత్వీకరించిన స్త్రీవాద కవయిత్రిగా చెప్పొచ్చు. అందుకని పురుషద్వేషి కాదు, స్త్రీల అభిమానం అంతే...!

తెలుగు సాహితీవనం నుంచి గత ఏడాది ఉగాది పురస్కారం కూడా అందుకున్నారు. మరికొన్ని సమూహాల పోటీలలో కూడా విజేతగా నిలిచారు. ప్రాసల కోసం ఆయాస పడకున్నా ఆమె కవిత్వంలో ఓ లయ ఉంది. సమాజంలోని అసమానతలను, అన్యాయాలను అక్షరాలుగా మలచిన తీరులో ఆవేదన ఆవేశము మనకు విస్తారంగా కనిపిస్తాయి.

అమ్మ కోసం. నాన్న కోసం రాసుకున్న కవితల్లో అపారమైన ప్రేమానురాగాలు,ఉగాది గురించి రాసిన కవితలో 'నిరాశా శిశిరాన్ని వీడి ఆవల వసంతంలో అడుగిడమంటూ చైతన్యపు చైత్రంలోకి ఆమని పలికే ఆహ్వానమే ఉగాది' అంటూ ఆశావాద దృక్పథాన్ని పలికించారు.

**"కాస్త గొంతు విప్పుదాం"** కవితలో **'మాటలు తప్ప మార్పు తేలేని మౌన పోరాటం ఇది'** అనడం అందరినీ ఆలోచింపచేస్తుంది.

'ఉత్తరానికే చిరునామా లేకుండా చేసేసావు కదా.. నువ్వొచ్చాక'' అంటూ సెల్ఫోన్ గురించి అనడం అక్షర సత్యం. కొన్ని సాంకేతిక ఆవిష్కరణలు మనకు సౌకర్యాలను ఇచ్చినా ఎన్నో తీపి జ్ఞాపకాలను చెరిపేయడం కూడా వాస్తవం.






ప్రతులకు: సత్యచాగంటి ఇ.నెం.1-48, శ్రీపురం (మం) ప్రతిపాడు వయా (ఎస్.ఓ) కాకినాడ జిల్లా-533 432
సెల్: 99488 34608

మన ఆలోచనలకు ఎంతో కొంత భావు కత్వము, కొంచెం ఇమేజినేషన్ జోడించి అక్షర రూపం ఇచ్చి ఓ కవిత గానో, ఓ కథగానో మలచి నప్పుడు వాస్తవం కొంత మరు గునపడినా, కొంచెం ఆకర్షణీయత జోడించి అవుతుంది అనేది సత్యమే.

స్వార్థం సిరలలో, దానవత్వం ధమనులలో చేరి నాలుగు గదులను నియంత్రిస్తుంటే మానవత్వాన్ని మరలా నింపుకునేందుకు మనిషి గుండెకిప్పుడు మరో ఖాళీ గది కావాలంటారు **'ఐదవ గది'** కవితలో...

తొలకరి చినుకుల ఆలింగనంలో పుడమి పులకరింతలకు ఓ నిదర్శనం ఆకులు చేసే కృతజ్ఞతలు అంటారు భావయుక్తంగా మరో కవితలో..

ఏదీ బాల్యం అంటూ అందమైన అనుభూతులను కోల్పోతున్న ఇప్పటి బాల్యాన్ని చూసి బాధను వ్యక్తం చేస్తారు.

**'మండిన గుండెల వేడిమికి రెప్పల అంచున కరుగుతున్న వ్యథలెన్నో'** అంటూ సమాజంలో నిత్యం ఓడిపోతున్న అభాగ్యుల గురించి కలత చెందుతారు.

ఇందులో ఇంకా ఏరులై పారుతున్న మద్యం గురించి, అరణ్య హత్యల గురించి, రైతుల గురించి, సంక్రాంతి పండగ గురించి.. ఇలా అనేక విభిన్న అంశాల గురించి కవితలు ఉన్నాయి.

ఏ అంశాన్ని తీసుకున్నా అంకిత భావంతో భావ వ్యక్తీకరణ చేయగల సమర్థత, సమాజాన్ని నిశితంగా పరిశీలించే ఆసక్తి నిండుగా ఈమెలో కనిపిస్తుంది.

సత్య చాగంటి ఇంకా రాయాలి. కవయిత్రిగా రచయిత్రిగా మంచి పేరును పొందాలని మనసారా కోరు కుంటూ, ఈ **'రంగులద్దని కుంచెలు'** కు హృదయ పూరమానవీయ దీపాలను వెలిగించడం తథ్యంక స్వాగతం పలుకు తున్నాను.

(సత్య చాగంటి "రంగులద్దని కంచెలు'' కవితా సంపుటికి శాంతికృష్ణ రాసిన ముందు మాట..)



**-శాంతి కృష్ణ**
ఇంకౌల్: 9502236670

## వందనం... అభివందనం...

చిన్నప్పుడు పలకా-బలపం పట్టించి
అ-ఆ..లు దిద్దించిన ఆద్య గురువులు మీరు!
చేతుల్లో పెన్ను పెట్టి
"వేల మెదళ్లకు శక్తినిచ్చే ఆయుధమిదే" అని చెప్పి
జ్ఞానమార్గాన్ని చూపిన జ్ఞానదీప్తులు మీరు!
కలలతో నడిచిన బాల్యంలో
అక్షరాల వెలుగుని పంచిన అక్షరదేవుళ్లు మీరు!
తప్పటడుగులు వేసినప్పుడు ప్రేమతో సరిదిద్దుతూ
సరైన దారి చూపిన మార్గదర్శకులు మీరు!
గురుత్వాకర్షణ శక్తిలా ఆకర్షించి
తాత్వికతతో జీవిత పాఠాలు చెప్పిన
దివ్య చైతన్యాలు మీరు!
×××
అద్దంలో గతాన్ని చూసుకున్నప్పుడల్లా
నన్ను మలిచిన మీ తీరు గుర్తొస్తుంది
నా ప్రతి విజయంలో మీ ఆశీస్సులు తోడై
ప్రతి మెట్టులో మీ ముద్ర ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది
ప్రపంచానికి నన్ను పరిచయం చేసినవారు మీరు కాదా!
నీతి, న్యాయం నేర్పిన ఆ పాఠాలు "శిలలపై చెక్కిన శాసనాల్లా"
నా హృదయంలో పదిలంగా నిలిచిపోయాయి
మీరు లేకపోతే, నేను ఈ స్థితిలో ఉండేవాడిని కాదేమో!
నా ఎదుగుదలకు మూలకారణం మీరు కాదా!
×××
మీ రుణం తీర్చే మార్గం తెలియదు గురువులారా...
"కృతజ్ఞతలు" అన్న పదం చెప్పడానికి చిన్నదిగా అనిపిస్తుంది
మీ వాత్సల్యానికి ఎన్ని వేల వందనాలైనా తక్కువే!
మీ ఆశీర్వాదమే నా బలమైన ఆయుధం
మీ చిరునవ్వే నా విజయయాత్రకు వెలుగు!
మీరు నేర్పిన అక్షరాలతో, ఇప్పుడు నా ప్రతి అక్షరంలో
మిమ్మల్ని చూసుకుంటూ నేను వేల పదాలు రాస్తున్నాను
కానీ... "కృతజ్ఞతలు" చెప్పే కొత్త పదం మాత్రం
ఇప్పటికీ కనుగొనలేకపోతున్నాను.
సమగ్ర గ్రంథమైన మీలో నేనెంత?
విద్యాదాతలైన గురువులారా,
వందనం... అభివందనం... పాదాభివందనం!!
(నాకు విద్యాబుద్ధులు నేర్పిన
గురువులందరికీ ప్రణామాలతో ?.. )



**- చిత్రాడ కిషోర్ కుమార్**
9866912906

## శ్మశానం

శాశ్వతమైన శ్మశానం
ఎంత నిశ్శబ్దం
ఎంత విశాలం
ఎందరూ చేరినా
కానీ ఎవరూ తోసిపడరు.
ఇక్కడ ఆశలకీ, ఆస్తులకీ,
అవకాశాలకీ స్థానం లేదు
వీధుల మధ్య తిరిగినవాడైనా,
వీలులేని విల్లాల్లో జీవించినవాడైనా,
చివరికి అందరూ
ఒకే నేలపైన పడుతారు
చెట్టు పుట్టా నరికి,
జంతువులను తరిమి,
బంగారు గడపలతో కోటలు కట్టినా
తనకంటే మిన్నగా స్వార్థాన్ని పెంచినవాడు,
ప్రపంచాన్ని ఆక్రమించినవాడైనా సరే
ఇకపై ఈ నిశ్శబ్ద శ్మశానమే
ఆఖరి చిరునివాసం
విలాసమూ, విరాసమూ
ఒక్కసారిగా మాయమైపోతాయి.
ఇక్కడ గుండె తడులు ఆగిపోతాయి,
అవగాహనలు గాలి అవుతాయి.
ఇరుకైన మనసుతో బ్రతికిన మనిషి
ఇక్కడే,
ఈ శాశ్వత శ్మశానంలోనే
ప్రశాంతమౌతాడు.



**-పోలీస్ భీమేశ్**
9505255218

## చైతన్యరసాకృతి

పచ్చదనాన్నిప్రేమిద్దాం
పచ్చదనాన్ని ఆరాధిద్దాం
పచ్చదనాన్ని ఆసాంతం
జీవితాల్లో పరచుకొందాం
పచ్చదనం ఒక్కటే
అన్ని సమస్యలకు
పరిష్కారమార్గం అని గ్రహిద్దాం
పచ్చదనమే బతుకనీ
ఆయుస్సూత్రమనీ భావిద్దాం.
పక్షుల కిలకిలారావాలతో
తుమ్మెద ఝుంకారాలతో
పూలతో విరితావులతో
స్వచ్ఛ పవనాలతో
స్వాదు జలాలతో
ప్రేమగానాలతో
కనువిందు చేసే ప్రకృతి
చైతన్యరసాకృతి
పచ్చని ప్రకృతి
ఆరోగ్యదాయకం
నయనానందకరం
నాగరికత పేరుతో
అభివృద్ధి పేరుతో
జరుగుతున్న
ప్రకృతి విధ్వంసాన్ని
ఆపుదాం..రేపటి తరాన్ని
నిలబెడదాం



**-మంకుశ్రీను**
9347100598

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.** RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com